# బోగస్ పింఛన్‌ల ఏరివేత

- ప్రయోగాత్మకంగా చిలకపాడులో నేడు పరిశీలన
- ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులతో 10 బృందాల ఏర్పాటు
- భౌతిక పరిశీలనకు ప్రత్యేక యాప్



ఒంగోలు నగరం, డిసెంబరు 8 : బోగస్ పింఛన్‌ల ఏరివేతకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలో భౌతిక పరిశీలనకు ఆదేశించింది. ప్రయోగాత్మకంగా సంతనూతలపాడు మండలం చిలకపాడులో సోమవారం ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రభుత్వం ప్రతినెలా కోట్లాది రూపాయల పింఛన్‌లను పంపిణీ చేస్తోంది. అందులో మన జిల్లాలో 2.87లక్షల మంది ఉన్నారు. గత వైసీపీ పాలనలో అనేక మంది అనర్హులకు ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేసింది. బోగస్ సర్టిఫికెట్లతో ఆపార్టీ సానుభూతిపరులు పెద్ద ఎత్తున లబ్ధిదారులుగా చేరిపోయారు. భర్త ఉన్న వారు కూడా వితంతు పింఛన్ పొందుతున్నారు. దివ్యాంగులు కాని వారు అక్రమంగా సదరమ్ సర్టిఫికెట్ పొంది ప్రతినెలా పింఛన్ తీసుకుంటున్నారు. వీరిలో చెవిటి విభాగంలో ఎక్కువ బోగస్ లబ్ధిదారులు ఉన్నట్లు ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయి.

### 10 బృందాల ఏర్పాటు

పింఛన్ లబ్ధిదారుల్లో అనర్హుల తొలగింపుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని ఒక్కో జిల్లాలో ఒక్కో గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భౌతిక పరిశీలన చేయాలని ఆదేశించింది. మన జిల్లాలోని సంతనూతలపాడు మండలం చిలకపాడులో ఈ ప్రక్రియ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అందుకోసం కలెక్టర్ తమీమ్ అన్సారియా 10 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కోదానిలో ఒక ఎంపీడీవో కానీ, ఈవోఆర్డీ లేదా కార్యాలయ పరిపాలనా అధికారితోపాటు ఒక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను నియమించారు. వీరంతా ఇతర మండలాలకు చెందిన వారే.

### లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పరిశీలన

ప్రత్యేక బృందాలు సోమవారం చిలకపాడులో వివిధ రకాల పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల అర్హతలను తనిఖీ చేయనున్నాయి. గ్రామంలో సుమారు 400 మంది వరకూ పింఛన్‌లు పొందుతుండగా ఒక్కో బృందానికి 40 మందిని కేటాయించారు. ఈ బృందంలోని అధికారులు ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్తారు. వారి అర్హత, ఆర్థిక స్థితిగతులు, భూములు, ఆస్తులు తదితర వివరాలను పరిశీలిస్తారు. దివ్యాంగ కేటగిరీలో పింఛన్ పొందుతుంటే నిజంగానే వికలత్వం ఉందా? లేదా? అన్నది చూస్తారు. సోమవారం ఒక్క రోజే చిలకపాడులోని అన్ని పింఛన్లను పరిశీలించనున్నారు. ప్రతి లబ్ధిదారుడికి సంబంధించిన వివరాలను ప్రభుత్వం అందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

ధాన్యం కొనుగోళ్లలో వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. రైతులను దగా చేస్తున్నారు. ఆరుగాలం కష్టాన్ని దోచుకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని అందినకాడికి దండుకుంటున్నారు. బస్తాకు (75కేజీలకు) ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే రూ.300 తగ్గించి ఇస్తున్నారు. తరుగు, తేమ సాకుతో తకరారు చేస్తున్నారు. మూడు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. మొత్తంమీద రైతులు బస్తాకు రూ.400 చొప్పున నష్టపోతున్నారు. ఏటా నవంబర్‌లోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే పౌరసరఫరాల శాఖ అధికారులు ఈసారి మీనమేషాలు లెక్కిస్తున్నారు. గతంలో సొసైటీలతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడి రూ.లక్షలు కూడబెట్టుకున్న వారు ఇప్పుడు కూడా అదే ప్రణాళికతో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నట్లు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



దర్శిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

# కొను గోల్‌మాల్

## ధాన్యం వ్యాపారుల దోపిడీ

- మార్కెట్‌లో మాయాజాలం
- బస్తాకు రూ.300 తగ్గించి కొనుగోలు
- తేమ పేరుతో అదనంగా మరో మూడు కిలోలు
- ప్రారంభంకాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్న అధికారులు
- మద్దతు ధర లభించక భారీగా నష్టపోతున్న రైతులు

దర్శి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. 15 రోజులుగా నూర్పిళ్లు ముమ్మరమయ్యాయి. కానీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రెండు వారాల క్రితమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ధరలను దిగ్గోసి కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండటం, చేతిలో డబ్బులు లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి భారీగా నష్టపోతున్నారు.

### ఎకరాకు రూ.14వేలు నష్టపోతున్న రైతులు

దర్శి ఎస్ఎస్సీ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 30వేల ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. 15 రోజుల నుంచి కోతలు, నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎకరాకు సగటున 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తోంది. ఎకరాకు పెట్టుబడి ఖర్చు రూ.25వేల నుంచి రూ.30వేల వరకూ అయ్యింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తే సరాసరి ఎకరాకు రూ.50వేల వరకూ రాబడి లభిస్తుంది. కానీ బస్తాకు వ్యాపారులు 400 వరకూ తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఎకరాకు రైతులు రూ.14వేల వరకూ నష్టపోతున్నారు.

### అధికారుల తీరుపై విమర్శలు

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో సివిల్ సప్లయీస్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. తమకు అనుకూలమైన సొసైటీలను ఎంచుకొని ధాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సవాచారం. గతంలో కేంద్రాలు నిర్వహించిన సొసైటీలకే ఇప్పుడు కూడా కట్టబెట్టి అక్రమ వ్యాపారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో అధికారులు, సొసైటీల మాటున కొందరు వ్యక్తులు పలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకుండానే ప్రైవేటు వ్యాపారులతో లాలూచీపడి రైతులను దగా చేశారు. జిల్లా కేంద్రంలో కొంతమంది ఉద్యోగులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించి గోల్‌మాల్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై అప్పట్లో విచారణ కూడా చేశారు. కాలక్రమంలో అది నీరుగారిపోయింది. ఆ సమయంలో అనేకమంది అక్రమార్కులు కొనుగోలు కేంద్రాలను అడ్డుపెట్టుకొని లక్షల్లో సంపాదించుకున్నారు. ఇప్పుడు కూడా అలాంటి ప్రక్రియే జరుగుతున్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రాలు ఎవరి ద్వారా నిర్వహిస్తారన్న విషయాన్ని ఇప్పటి వరకూ వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. రైతులు అడిగితే త్వరలో ప్రారంభిస్తున్నామని చెబుతున్నారే తప్ప స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు.

### ప్రైవేట్ వ్యాపారుల దగా

ఏటా నవంబరులోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే వారు. కానీ ఈసారి ఆ ఊసే కరువైంది. దర్శి నియోజకవర్గంలో 11 చోట్ల వీటిని ప్రారంభిస్తున్నట్లు 15 రోజుల క్రితం అధికారులు ప్రకటించారు. వీటిలో బొట్లపాలెం, దర్శి, రాజంపల్లి, చందవరం, కల్లూరు. ఈదర, పసుపుగల్లు, ముండ్లమూరు, మన్నేపల్లి, లక్కవరం, దోసకాయలపాడు గ్రామాలు ఉన్నాయి. కానీ ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం గ్రేడ్-ఏ రకం ధాన్యం 75 కేజీల బస్తా రూ.1,740, సాధారణ రకం రూ.1,725కు కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు 75 కేజీల బస్తాను కేవలం రూ.1,400కు కొనుగోలు చేస్తున్నారు. తరుగు, తేమ సాకుతో మరో మూడు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. దీంతో రైతులు బస్తాకు రూ.400 చొప్పున కోల్పోతున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే అక్కడ విక్రయించుకొని గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉంటుంది. కానీ ఆవిషయంలో అధికారులు పిల్లిమొగ్గలు వేస్తూ జాప్యం చేస్తున్నారు.





చిల్లచెట్లతో నిండిఉన్న భూమి
(ఇన్‌సెట్లో) సర్వేనెంబర్ 34లో సాగులో లేని భూమి

# భూమాయ

- కరోళ్లపాడులో కోర్టు వివాదంలో ఉన్న భూమిపై కన్నేసిన నాయకుడు
- సివిల్ కోర్టుదే తుది నిర్ణయమని తేల్చిచెప్పిన రెవెన్యూ ఉన్నతాధికారులు
- అడంగల్‌లో పేర్లు లేకుండానే ఆన్‌లైన్ చేసేందుకు ప్రయత్నం

పామూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వివాదంలో ఉన్న భూమిపై ఓ నాయకుడు కన్నేశాడు. లొసుగులను ఆసరా చేసుకొని ఆక్రమించేందుకు ఉపక్రమించాడు. రెవెన్యూ అధికారుల అండతో దాన్ని సొంతం చేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు. పామూరు మండలం తూర్పుకట్టకిందపల్లి గ్రామ పంచాయతీ పరిధి కరోళ్లపాడు రెవెన్యూలోని సర్వే నంబర్ 34లో 30.26 ఎకరాల పట్టా భూమి గ్రామానికి చెందిన యర్రం శెట్టి పెద కొండయ్య, యర్రం శెట్టి కొండయ్య కుటుంబాలకు ఉంది. యర్రంశెట్టి కుటుంబ వివాదాలతో 50ఏళ్లుగా ఈ భూమి సాగులో లేదు. 1950 నుంచి నెల్లూరు కోర్టులో, 1986 నుంచి కనిగిరి కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ భూమిపై పంచాయతీకి చెందిన నాయకుడి కన్నుపడింది. రెవెన్యూ అధికారులను మభ్యపెట్టి తన అనుయాయుల పేర్లను వన్‌బీ ఖాతాలో ఎక్కించుకొన్నాడు. ఇప్పుడు ఆన్‌లైన్ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

### వన్‌బీ అంతా మార్చేశారు

పంచాయతీకి చెందిన నాయకుడు 2014లో అప్పటి రెవెన్యూ అధికారులను లోబర్చుకొని తన అనుయాయులైన యర్రం శెట్టి అంకయ్య పేరుపై ఖాతా నెంబర్ 278లో 7.56 ఎకరాలు, మాల్యాద్రి పేరుపై ఖాతా నెంబర్ 279లో 7.56 ఎకరాలు, మాలకొండయ్య పేరుపై ఖాతా నెంబర్ 280లో 7.56 ఎకరాల వంతున వన్ ఏ, అడంగల్‌లో పేర్లు లేకుండా, ఆర్‌సీ నంబర్ లేకుండానే ఖాతానంబర్ సృష్టించి వన్‌బీలో పేర్లు నమోదు చేయించుకున్నారు. సర్వే నంబర్ 34లో మొత్తం భూమి 30.26 ఎకరాలు ఉండగా దాన్ని రెవెన్యూ అధికారులు పెంచి 40.26 ఎకరాల విస్తీర్ణంగా చూపిస్తూ పేర్లు ఎక్కించడం వివాదాస్పదమైంది.

### కోర్టు తీర్పు ఇచ్చినా..

విషయం తెలుసుకొన్న యర్రంశెట్టి కొండయ్య వారసులైన వెంకటేశ్వర్లు, పూర్ణయ్య, పెద వెంగమ్మ, రమేష్‌లు కనిగిరి కోర్టును ఆశ్రయించారు. 2018లో రిట్ పిటిషన్ నంబర్ 28872 జస్టిస్ పి.ప్రవీణ్‌కుమార్ ఇచ్చిన తీర్పులో పట్టాదారు పాసుపుస్తకం చట్టం 1971 ప్రకారం సివిల్ కోర్టు వివాదాల్లో ఉన్న భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు ఎలాంటి మార్పులు, చేర్పులు చేయకూడదని స్పష్టం చేశారు. అయితే తుది నిర్ణయం సివిల్ కోర్టుదేనని 2019లో అప్పటి జేసీ ఎం.శ్రీనివాసులు, కందుకూరు ఆర్డీవో కేఎస్ రామారావు కూడా స్పష్టం చేశారు. అయినప్పటికీ గ్రామానికి చెందిన ఆ నాయకుడు 22.50 ఎకరాలు తన అనుయాయుల పేర్లపై ఆన్‌లైన్ ఎక్కించుకునేందుకు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నాడు. ఇప్పటికైనా జిల్లాస్థాయి రెవెన్యూ అధికారులు భూ రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

### తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి



కరోళ్లపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 34లో ఉన్న 30.26 ఎకరాల భూమి మా పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చింది. అడంగల్‌లో మా పేర్లు నమోదై ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ నాయకుడు రెవెన్యూ అధికారులను మభ్యపెట్టి వన్ ఏలో పేర్లు లేకుండా, వన్‌బీలో ఆర్సీ నంబర్ లేకుండానే ముగ్గురు వ్యక్తుల పేర్లపై 40 ఎకరాల వరకు నమోదు చేయించారు. తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- యర్రంశెట్టి పూర్ణయ్య, కరోళ్లపాడు

### కోర్టు వివాదంలో ఉన్న భూమిని రక్షించాలి



సర్వే నెంబర్ 34లోని 30.26 ఎకరాల భూమికి సంబంధించి 50 ఏళ్లుగా కనిగిరి సివిల్ కోర్టులో వివాదం నడుస్తోంది. కోర్టు వివాదాల్లో రెవెన్యూ శాఖ జోక్యం చేసుకోకూడదని తుది నిర్ణయం సివిల్ న్యాయస్థానానిదేనని జేసీ, ఆర్డీవో కోర్టు గతంలో తీర్పు ఇచ్చాయి. గ్రామానికి చెందిన నాయకుడు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ విస్తీర్ణం చూపించి రికార్డులను తారుమారు చేయిస్తున్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్న వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి.

- రమేష్, కరోళ్లపాడు




# నిశీధిలో కుటుంబ రథసారథులు

- నగరం నిద్రపోతున్న వేళ.. రెక్కలుముక్కలు చేసుకుంటున్న పేదలు
- బడుగు జీవుల బతుకు పోరాటంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

7లో



కబడ్డీ పోటీలను తిలకిస్తున్న ఒంగోలు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్ తదితరులు

### కబడ్డీ.. కబడ్డీ..

సంతనూతలపాడులో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రెండోరోజైన ఆదివారం రాత్రి 11 గంటలకు లీగ్‌దశ పురుషుల విభాగంలో కర్నూలు, ప్రకాశం, తూర్పుగోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం, కృష్ణా, గుంటూరు జట్లు విజయం సాధించాయి. మహిళల విభాగంలో విశాఖ, చిత్తూరు, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, కృష్ణా జట్లు గెలుపొందాయి. తూర్పుగోదావరి, ప్రకాశం మధ్య మ్యాచ్ టై అయ్యింది. అర్ధరాత్రి వరకూ పోటీలు కొనసాగాయి.

వివరాలు 7వ పేజీలో

# గ్రానైట్ పరిశ్రమను కాపాడండి

- పోలీసులు, మైనింగ్, విజిలెన్స్ అధికారుల మెరుపు దాడులతో కుదేలవుతున్నాం
- బిల్లులతో వెళ్తున్నా ఏదో సాకుతో సీజ్ చేస్తున్నారు
- ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ వద్ద ఫ్యాక్టరీ యజమానుల మొర
- నేడో, రేపో ఎస్పీని కలవాలని యూనియన్ నాయకుల నిర్ణయం

7



# కుదుటపడిన కర్ణాటక పొగాకు మార్కెట్

- సజావుగా సాగుతున్న వేలం
- పెరిగిన రోజువారీ కొనుగోళ్లు
- తగ్గిన నోబిడ్‌లు, గరిష్ఠ ధర కిలో రూ.293
- సగటు ధర కిలోకు రూ.262
- ఇప్పటిదాకా 24 మిలియన్ కిలోల కొనుగోలు

వివరాలు 7వ పేజీలో

## ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

● హాజరైన మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య




పూజలు చేస్తున్న మంత్రి స్వామి, దామచర్ల సత్య

జరుగుమల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): జరుగుమల్లిలో ప్రతిష్ఠించనున్న 27 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆదివారం ఉదయం పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు వైసీపీ కొండపి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి డాక్టర్ మాదాశి వెంకయ్య పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్, నాయకులు దగ్గుమాటి సుబ్బారెడ్డి, కొమ్మాలపాటి కృష్ణ, మక్కెన వెంకటరావు, నేతి రవికుమార్, గ్రామ నాయకులు దగ్గుమాటి శంకర్‌రెడ్డి, మన్నం రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, రామారావు, శేషారెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

## ఏపీఆర్ఎస్ఏ డివిజన్ నూతన కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఒంగోలు డివిజన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో అసోసియేషన్ నాయకులు పిన్నిక మధుసూదనరావు, ఆర్.వాసుదేవరావు, ఎన్వీబీ.రాజేష్, ఊతకోలు శ్రీనివాసరావు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు బొల్లాపల్లి సత్యసాయి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. డివిజన్ అసోసియేషన్ ప్యానల్‌లో 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారులు కె.వెంకటేశ్వరరావు, రామనారాయణరెడ్డి నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. డివిజన్ అధ్యక్షుడిగా జి.ఆంజనేయులు(తహసీల్దార్), అసోసియేట్ అధ్యక్షుడిగా ఆర్.బ్రహ్మయ్య (తహసీల్దార్), ఉపాధ్యక్షులుగా ఎండి.షమివుల్లా, కె.శివరామకృష్ణ, ఎ.గౌతమి(డిప్యూటీ తహసీల్దార్లు), కార్యదర్శిగా కె.సాయిపవన్(డిప్యూటీ తహసీల్దార్), జాయింట్ సెక్రటరీలుగా పీవీ.రమణయ్య(ఆర్ఐ), కె.కోటిరెడ్డి (డ్రైవర్), ఎన్.కొండయ్య(ఆఫీసు సబార్డినేట్), కోశాధికారిగా డి.వెంకటేశ్వర్లు(సీనియర్ అసిస్టెంట్), సభ్యులుగా పి.ఉపేంద్ర, కె.జయకృష్ణ(జూనియర్ అసిస్టెంట్లు) ఎన్నికయ్యారు.

## జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కమిటీ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ఒంగోలులోని ఎస్‌బీకేఆర్ ఓరియంటల్ స్కూలులో జరిగిన కార్యవర్గ సమావేశానికి పరిశీలకులుగా ఎస్.మురళీ, జిల్లా పరిశీలకులుగా డీఎల్ఎన్.రెడ్డి, సీబీమైకెల్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్‌గా తోపూరు సుబ్బారావు, చీఫ్ ప్యాట్రన్‌గా మండవ వెంకటస్వామి, ప్యాట్రన్‌గా ఈదర సుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆళ్ల వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా సోమినేని సురేష్, జనరల్ సెక్రటరీగా ఆళ్ల రామ్మోహన్, , కోశాధికారిగా నెప్పల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటస్వామి, పి.రాజేష్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు, వెంకటశేషయ్య బాలాజీ, జాయింట్ సెక్రటరీలుగా వెంకటేశ్వర్లు, పి.మురళి, జి.సురేష్, మోహన్‌రావు, ఎస్.కోటేశ్వరరావులు ఎన్ని కయ్యారు.

## ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

మద్దిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ఒంగోలు జేఎంబీ చర్చి పాస్టర్ డీజే.అగస్టీన్ పేర్కొన్నారు. ఆదివారం పెద్దకొత్తపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ కాపరి సుశాంత్ రావుతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేశారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించారు. కార్యక్రమంలో కేఎంబీ.జ్యోతి, కె.శారద, కృపాదానం, రూతు పాల్గొన్నారు.



# రహదారులకు మహర్దశ

నాలుగేళ్లుగా నిలిచిన నేకునంబాదు-దొడ్డవరం రోడ్డు పనులు ● ఎమ్మెల్యే బీఎన్ ఒత్తిడితో ప్రారంభించిన కాంట్రాక్టర్ ● దాదాపు రూ.50లక్షలతో రోడ్లకు మరమ్మతులు



పునఃప్రారంభమైన నేకునంబాదు-దొడ్డవరం రోడ్డు పనులు

చీమకుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికాముకునిగా పేరుగాంచిన సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తన నియోజకవర్గంలో కీలకమైన రహదారులపై దృష్టి సారించారు. గుంతలమయమై, రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు గురిచేస్తున్నా గత వైసీపీ ప్రభుత్వంలో రహదారులు బాగోగులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. దీనికి తోడు మొదలుపెట్టిన బీటీరోడ్డు పనులు సైతం సగంలోనే నిలిపివేశారు. దీంతో చీమకుర్తి మండలంతోపాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రజలు ఇక్కట్లుకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎమ్మెల్యే బీఎన్ దెబ్బతిన్న రోడ్ల దుస్థితిపై స్పందించారు. రహదారులకు మరమ్మతులు, ఆగిపోయిన పనులను పునఃప్రారంభించడం, రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చిల్లచెట్ల తొలగింపు ప్రక్రియపై దృష్టి సారించారు. ముఖ్యంగా చీమకుర్తి, మద్దిపాడు మండలాలను కలిపే నేకునంబాదు-దొడ్డవరం మధ్య మూడేళ్లక్రితం దాదాపు రూ.1.15కోట్లతో బీటీరోడ్ నిర్మాణాన్ని చేపట్టారు. కానీ నిధుల మంజూరులో తీవ్ర జాప్యం కావటంతో కాంట్రాక్టర్ రావూరి వెంకటేశ్వర్లు రోడ్డు నిర్మాణపనులను అర్థాంతరంగా ఆపేశారు. దానికి గాను దాదాపు రూ.50లక్షలు మంజూరైనట్లు తెలుస్తుంది. ఇపుడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సదరు కాంట్రాక్టర్‌ని పిలిపించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఒత్తిడి చేయటంతో ఆదివారం ఆయన నిర్మాణ పనులను పునఃప్రారంభించారు. నెలరోజుల్లోపు పనులు పూర్తి చేయాలన్న బీఎన్ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ సిద్ధమయ్యారు.

**రూ.50లక్షలతో రోడ్ల మరమ్మతులు..**

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దాదాపు రూ.50లక్షలతో దెబ్బతిన్న కీలకమైన రహదారులకు మరమ్మతులు చేపట్టటానికి టెండర్లు పిలిచారు. సోమవారం టెండర్లు ఖరారు అయి పనులను ప్రారంభిచనున్నారు. వీటిలో చీమకుర్తి నుంచి రుద్రవరం వరకు చిన్నరాస్తాపై ఏర్పడిన గుంతలకు ప్యాచ్‌వర్క్ చేపట్టనున్నారు. దీంతోపాటు ఎండ్లూరి డొంక నుంచి రుద్రవరం, గంగవరం నుంచి ఏలూరివారిపాలెం, సంతనూతలపాడు నుంచి కొణిజేడు వరకు జంగిల్ క్లియరెన్స్ పనులను దాదాపు 45 కిలోమీటర్ల మేర చేయనున్నారు. కాగా గంగవరం నుంచి ఏలూరివారిపాలెంకు రూ.5లక్షలు, ఎండ్లూరు డొంక నుంచి రుద్రవరం వరకూ రూ.5లక్షలు, సంతనూతలపాడు నుంచి మద్దులూరు వరకూ రూ.5లక్షలు, చీమకుర్తి నుంచి రుద్రవరం వరకూ చినరాస్తాపై రూ.15లక్షలతో పాటు నాలుగు మండలాల్లో 19 వర్క్‌లను వివిధ రోడ్లపై మరమ్మతులు నిర్వహించటానికి టెండర్లు ఖరారయ్యాయి. ఈ పనులు అన్ని పూర్తయితే నియోజకవర్గంలో రహదారులు గుంతలు లేనివిగా మారనున్నాయి. ఆదివారం నుంచి చినరాస్తాపై జంగిల్‌క్లియరెన్స్ పనులు కూడా ప్రారంభమయ్యాయి.

# మాజీ సైనికుల సంక్షేమానికి సహకారం

● ఎమ్మెల్యే దామచర్ల



జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(రూరల్), డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమం కోసం తనవంతు పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో నావీడే కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అమర జవానుల జ్ఞాపకార్థం సమగ్రమైన డిఫెన్స్ కాంప్లెక్స్‌ను రంగారాయుడు చెరువు వద్ద ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే మాజీ సైనికులకు నివేశన స్థలాలు మంజూరు చేస్తామని, జవానుల సేవలను ఎలకట్టలేనివని చెప్పారు. సైనికుల క్రమశిక్షణ, రక్షణ వల్లే దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉందని పేర్కొన్నారు. సైనికులకు ఎప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయని, ఎప్పుడైనా తనను కలవచ్చని తెలిపారు. ముందుగా వీరజవానుల విజయస్థూపం వద్ద ఎమ్మెల్యే దామచర్ల, మాజీ సైనికులు పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బహుమతులను అందజేశారు. జిల్లా మాజీ సైనికుల అధ్యక్షుడు ఆలపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి రజనీకుమారి, అమృత వైద్యశాల డాక్టర్ కేశవ, కిమ్స్ వైద్యశాల సీఈవో అంకిరెడ్డి, కిమ్స్ వైద్యురాలు జ్యోతిప్రియదర్శిని, సంక్షేమకార్యదర్శి పాశం వెంకటరెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడు కటారి బ్రహ్మయ్య, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకటరావు, మాజీ సైనికులు బాలిరెడ్డి, రాముడు, పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్యశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● టీఎన్ఎంహెచ్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న నాగరాజు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వివిధ హోదా కలిగిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎన్ఎంహెచ్ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు కోరారు. ఆదివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనాలోచితంగా విడుదలైన జీఎం నెం.143 రద్దు చేయాలన్నారు. సీనియర్ ఏఎన్ఎం నుంచి జీఎన్ఎంగా శిక్షణ పొందిన ఉద్యోగోన్నతులు కల్పించాలని చెప్పారు. అలాగే గ్రేడ్-3 ఏఎన్ఎం అందరినీ వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. క్షేత్రస్థాయి ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ మినహాయింపు ఇవ్వాలని, ఎల్‌హెచ్‌వీ ట్రైనింగ్‌తో సంబంధం లేకుడా 12 సంవత్సరాల స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. అన్ని కేడర్లలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని చెప్పారు. ఆశా వర్కర్ల వేతనాలు పెంపుతోపాటు, జిల్లాస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని వెల్లడించారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.భానుమూర్తి, ప్రధానకార్యదర్శి బి.శ్రీనివాసాచార్యులు, మహిళా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ వెంకటలక్ష్మి, కన్వీనర్లు హబీబ్‌ఖాన్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

ఏపీ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా కె.వెంకట్రావు, అధ్యక్షుడిగా పీవీ.రవి, ప్రధాన కార్యదర్శి పి.ఆదిలక్ష్మి, కోశాధికారి ఎం.చినవెంకటయ్య, వర్కింగ్ అధ్యక్షులుగా పి. హబీమ్‌ఖాన్, ఉపాధ్యక్షులుగా యుగంధర్, రావి రామకృష్ణ, పి.ప్రభాకర్, డి.వెంకటేశ్వర్లు, జి.సులోచనరాణి, జాయింట్ సెక్రటరీలుగా కె.పద్మకుమారి, డి.శ్రీనివాసమారుతి, షేక్ మీర్‌సాహెబ్, ఇ.ధనలక్ష్మి, కె.రూతమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాను, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అరుణకుమారి, ఐ.మీనాక్షిలను ఎన్నుకున్నారు.

## పోలీస్‌శాఖకు ఎన్ఆర్ఐ డ్రోన్ వితరణ



ఎస్పీకి డ్రోన్‌ను అందజేస్తున్న వెంకట్రావు

ఒంగోలు(క్రైం), డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖకు ఎన్ఆర్ఐ తానికొండ వెంకటరావు అధునాతన డ్రోన్ కెమెరాను వితరణ చేశారు. ఆదివారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ దామోదర్‌ను కలిసిన వెంకట్రావు డ్రోన్ కెమెరాను అందజేశారు. దానిని దర్శి సీఐ వై.రామారావుకు ఎస్పీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల విధి నిర్వహణలో డ్రోన్ ఎంతో కెమెరా ఉపయోగపడుతుందన్నారు. ఎన్ఆర్ఐ వెంకట్రావును అభినందిచారు. కార్యక్రమంలో ఐటీకోర్ టీమ్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, దర్శి ఎస్ఐ మురళి, పీసీఆర్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సముద్రంలో మత్స్యకారుడు మృతి

కొత్తపట్నం, డిసెంబరు 8 ఆంధ్రజ్యోతి) : సముద్రంలో వేట సాగిస్తూ ప్రమాదవశాత్తూ జారి పడి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన కొత్తపట్నం తీరంలో జరిగింది. శనివారం రాత్రి వేటకు వెళ్లిన కొత్తపట్నం పల్లెపాలెంకు చెందిన నాయుడు రామలింగయ్య(52) అర్ధరాత్రి వరకు వేట చేస్తూ ప్రమాదవశాత్తూ నీటిలో జారిపడ్డాడు. సముద్రంలో ఉన్న వల ఆయనకు చుట్టుకుపోవటంతో ఈతతో తిరిగి పడవ మీదకు రాలేక ప్రాణాలు విడిచాడు. తోటి మత్స్యకారులు రక్షించేలోపే రామలింగయ్య మృతిచెందాడు. మృతదేహాన్ని సహచరులు అదే పడవలో ఒడ్డుకు చేర్చారు. దీంతో మృతుడికి కుటుంబీకులు బోరున విలపించారు.

## యువకుడు మృతిపై కేసు నమోదు

● శవపరీక్షకు పోలీసుల చర్యలు

కొత్తపట్నం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు నాలుగు రోజుల క్రితం మృతి చెందగా అంత్యక్రియలు పూర్తి అయ్యాక ఇప్పుడు కేసు నమోదు అయ్యింది. దీంతో మృతదేహానికి పరీక్షలు చేయించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెం నివాసి రామలింగం పిచ్చిరెడ్డి(35) ఈ నెల 3వ తేదీన గ్రామ శివారులోని పొలాల్లో అనుమానాస్పదంగా మృతిచెందాడు. మృతదేహాన్ని పిచ్చిరెడ్డి స్వగ్రామం అయిన నెల్లూరు జిల్లా బోగోలు మండలం సిద్దన్నపేటకు తీసుకుని ఈ నెల 4వ తేదీన అంత్యక్రియలు నిర్వహించారు. అయితే పిచ్చిరెడ్డి మృతిపై అనుమానం రావటంతో అతని తల్లి రామలింగం సుశీలమ్మ ఆదివారం కొత్తపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోడలు విజయదుర్గ, గ్రామంలోని మరో వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు పిచ్చిరెడ్డి మృతిపై అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసి సిద్దన్నపేటలో పూడ్చి ఉన్న మృతదేహాన్ని తీయించి వైద్యులతో పరీక్షలు చేయించేందుకు చర్యలు చేపట్టారు.

## ఘనంగా విశ్వబ్రాహ్మణ వన సమారాధన

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం పాత బైపాస్ రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, రవి తొట్టెంపూడి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పోతకమూరి బాలసుబ్రహ్మణ్యం, కళ్యాణమండపం అధ్యక్షులు చోడా శ్రీనివాసులు, మంచాబాబు, బ్రహ్మానందశర్మ, మహంకాళి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సరస్వతీదేవికి నమస్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

పొన్నలూరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు హైస్కూల్‌లో 1978-79 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల సమావేశం ఆదివారం స్కూల్ ఆవరణలో జరిగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ బ్యాచ్‌కు చదువు చెప్పిన హిందీ ఉపాధ్యాయుడు రమణయ్యను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా స్కూల్‌లోని సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎంవీ.చలపతిరావు, హాస్టల్ వార్డెన్ కె.బ్రహ్మానందచారి, ఆర్టీసీ ఉద్యోగి కొత్త వెంకటేశ్వర్లు, వ్యాపారవేత్త మండవ వెంకటేశ్వర్లు, వస్త్ర వ్యాపారి ఎం.బ్రహ్మయ్య, వ్యాపారులు తాళ్లూరి వెంకట సత్యనారాయణ, వ్యవసాయదారులు పెరికపాలెం ఎ.రాజేశ్వరరావు, టీవీఎస్.ను భాషిణి తదితరులు పాల్గొన్నారు.

## విరాళాల సేకరణ

చీమకుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలో ఈనెల 13,14,15వ తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయటానికి సహకరించాలని కోరుతూ ఆదివారం పట్టణంలో నాయకులు విరాళాల సేకరణను చేపట్టారు. కార్యక్రమంలో మాబు, పమిడి వెంకట్రావు, కాలం సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, బంకా సుబ్బారావు, పల్లాపల్లి ఆంజనేయులు, తిరుపతిరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

టంగుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో ఈనెల 15న జరిగే మాలల మహాగర్జన పోస్టర్‌ను, కరపత్రాలను ఆదివారం టంగుటూరు అంబేడ్కర్‌నగర్‌లో ఆవిష్కరించారు. మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, వంశీ, శ్రీకాంత్, సునీల్, రాజు, క్రాంతి, అవినాష్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి : ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న మంజుల

ఒంగోలు విద్య, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం సబ్ కమిటీ, రాష్ట్ర కౌన్సిలర్ల సంయుక్త సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన అరియర్ బిల్లులతో పాటు పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం యాప్‌ల భారాన్ని తొలగించి బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలన్నారు. పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు మాట్లాడుతూ క్లోజర్స్‌కు సంబంధించి జాప్యం జరుగుతుందని, దాని నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐ.విజయసారథి, టి.సుబ్బరాయుడు, లెవి ప్రసాద్, బి.శేషారావు, పి.హనుమంతరావు, కె.తిరుమల, ఎస్కే.నాయబ్‌రసూల్, కె.మల్లికార్జునరావు, పి.శేఖర్‌రెడ్డి, ఎస్కే.ఖాదర్‌బాషా, ఎం.యోహాన్‌రెడ్డి, కె.రవి, ఎస్.నారాయణరెడ్డి, పి.రాజకుమార్, కె.శ్రీనివాసరావు, టి.సుబ్బారావు, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం మామిడిపాలెం అసైన్డ్ భూ సమస్యను అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని దళిత రైతు భూపోరాట కమిటీ కన్వీనర్ దాసరి సీతారాములు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత 20 ఏళ్ళ నుంచి భూపోరాటం చేస్తున్నా ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. అన్యాక్రాంతమైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వాస్తవ స్థానిక రైతులకు స్వాధీనం చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇంత వరకు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని భూ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

## నేటి నుంచి శిక్షణ : డీఈవో

ఒంగోలు విద్య, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూలు లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమానికి ఎంపికైన ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు సోమవారం నుంచి ఆరు రోజుల పాటు ఒంగోలులోని శ్రీ రామచంద్ర మిషన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు, కేఆర్‌పీలు, డీఆర్‌పీలకు సోమవారం నుంచి చీరాలలోని ఎఫ్.ఎల్.ఎన్.లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణకు కేటాయించిన అధ్యాపకుల వివరాలను ఇప్పటికే మెయిల్, వాట్సాప్ ద్వారా పంపామని, సంబంధిత ఉప విద్యాధికారులు, మండల విద్యాశాఖాధికారులు విధులు కేటాయించిన వారిని వెంటనే రిలీవ్ చేసి శిక్షణకు పంపించాలని ఆయన సూచించారు.

## క్విస్ అధ్యాపక బృందం పరిశోధనకు పేటెంట్

ఒంగోలు విద్య, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫంగస్ వల్ల కలిగే వ్యాధులను నివారించేందుకు క్విస్ ఫార్మసీ అధ్యాపక బృందం కొత్త హెర్బల్ స్ప్రేను అభివృద్ధి చేసింది. ఆ ఆవిష్కరణకు పేటెంట్ జారీ అయింది. సహజంగా ప్రతి ఒక్కరికి ఫంగస్ వ్యాధులు సక్రమిస్తుంటాయి. అలాంటి వాటికి ఎక్కువగా ఇంగ్లీషు మందులపై ఆధారపడుతుంటారు. వాటి వల్ల అనేక దుష్ప్రభావాలు వస్తుంటాయి. ఈనేపథ్యంలో ఫంగస్ వ్యాధుల నివారణకు ఏదైనా ఔషధం కనుక్కోవాలనే ఉద్దేశంతో ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, అధ్యాపకులు డాక్టర్ జి.రవీంద్రబాబు, బి.శశిధర్, బీఫార్మసీ విద్యార్థులు సంయుక్తంగా పరిశోధనలు చేశారు. కొత్తగా పోలీ హెర్బల్ నానో ఎ మెల్సీన్ స్ప్రేను తయారు చేశారు. వారు చేసిన ఆవిష్కరణకు పేటెంట్ లభించింది. తక్కువ ఖర్చుతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఈ స్ప్రేతో ఫంగస్ వ్యాధులు నివారించవచ్చని పరిశోధన చేసిన బృందం ప్రతినిధులు తెలిపారు. రానున్న రోజుల్లో ఇలాంటి అవిష్కరణలు మరిన్ని చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదివారం అధ్యాపక బృందాన్ని కళాశాల ప్రెసిడెంట్ సూర్యకళ్యాణచక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీగాయత్రి అభినందించారు.

## ప్రశాంతంగా మెరిట్‌స్కాలర్ షిప్ పరీక్ష

ఒంగోలు విద్య, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్ష ఒంగోలులో ఐదు కేంద్రాలు, మార్కాపురంలో ఏడు, కనిగిరిలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు 3,370 మంది దరఖాస్తు చేసుకోగా 3,184 మంది హాజరయ్యారు. 186 మంది గైర్హాజరయ్యారు. ఆయాపరీక్షా కేంద్రాల్లో ఉప విద్యాధికారులు, ఫ్లయింగ్ స్కాడ్ అధికారులు పర్యవేక్షించారని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

## ఏపీ పవర్ డిప్లమో ఇంజనీర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా చీమకుర్తి డీఈ



మోహనరావు

ఒంగోలు(క్రైం)/చీమకుర్తి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఏపీ పవర్ డిప్లమో ఇంజనీర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా రాయపూడి మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పఠాన్ హుసేన్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో అసోషియేషన్ కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుతం చీమకుర్తిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మోహనరావు ఏపీసీపీడీసీఎల్ పరిధిలో అధ్యక్షుడుగా ఎంపిక కాగా పలువురు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీర్ల సమస్యలు పరిష్కారానికి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## పోలేరమ్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

జరుగుమల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): కామేపల్లిలోని పోలేరమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి చీర, జాకెట్, పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకుడు శ్రీధర శ్రీనివాసశర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో బైరాగిచౌదరి పాల్గొన్నారు.

## హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలి

మద్దిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకుడు ఈమని బలరాం కోరారు. ఆదివారం మల్లవరంలోని గుండ్లకమ్మ వద్ద గల ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయ ట్రస్ట్ బోర్డులలో రాజకీయ పార్టీలతో ప్రమేయం లేని దైవ భక్తులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నట్టే శ్రీనివాసరావు, అర్చకులు రమేష్, మార్నేని వెంకట్రావు, పెద్దసుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

నాగులుప్పలపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలైన సంఘటన నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులో జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు, బినిడమానూరు గ్రామానికి చెందిన అయ్యప్పస్వాములు నవీన్, దేవరాజ్ ఆదివారం రాత్రి ఒంగోలులో పూజ సామగ్రి కొనుగోలు చేసి తమ ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళుతున్నారు. ఈక్రమంలో పోతవరంకుంట వద్దకు రాగా ఎదురుగా వస్తున్న ఆటో రోడ్డు పక్కనున్న కంకర కుప్పలను తప్పించబోయి వారికి ఢీకొనడంతో ఇద్దరు స్వాములు రోడ్డుపై పడి గాయపడగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

## 7 మద్యం సీసాలు స్వాధీనం

జరుగుమల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె. బిట్రగుంట గ్రామంలోని కటకం వెంకయ్య అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 7 క్వార్టర్ మద్యం సీసాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నామని సింగరాయకొండ ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి తెలిపారు.

## సీపీఐ సభ్యత్వ నమోదును చేపట్టాలి

ఒంగోలు(రూరల్), డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): సీపీఐ సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలు మండలం కరవదిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన పార్టీ శత వసంతాల వేడుకలను ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని కోరారు. అదేరోజు సాయంత్రం ఒంగోలులో ర్యాలీ ఉంటుందన్నారు. అద్దంకి లెనిన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్.వెంకట్రావు, వి.హనుమారెడ్డి, పోలవరపు సీతారామయ్య, గద్దల రవి, పులి సురేష్, జి.సుధాకర్, రమేష్, సుజాత, ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలు చదివి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకుడు గుమ్మడి గోవర్ధనరాజు అన్నారు. టంగుటూరు గ్రంథాలయంలో ఆదివారం చదవడం నాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి వచ్చేలా అలవాటు చేయాలని సూచించారు. కనీసం ప్రతి ఆదివారం అయినా గ్రంథాలయానికి వచ్చేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు.

# నిశీధిలో కుటుంబ రథసారథులు

**నగరం నిద్రపోతున్న వేళలో రెక్కలుముక్కలు చేసుకుంటున్న పేదలు**
**బడుగు జీవుల బతుకుపోరాటంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం**


పూల దండలను కడుతున్న మహిళలు


చీకట్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

అందరూ గుర్రుపెట్టి నిద్రపోతుంటారు.. కానీ
వారు మాత్రం గుండెలవిసేలా శ్రమిస్తున్నారు..!
అందరూ చలికి భయపడి గట్టిగా ముసుగు పెట్టిన వేళ..
వారు మాత్రం రెక్కలు ముక్కలు చేసుకుంటారు...!
నగరం మొత్తం ప్రశాంతంగా ఉన్న వేళ..
వారు మాత్రం పరుగులు తీస్తుంటారు..!
విభిన్న పనులు చేస్తూ బతుకు బండిని
సాఫీగా లాక్కెళుతున్న బడుగులెందరో..
వారిలో కొందరు.. పొద్దుపొద్దునే నిద్ర లేచేసరికి
రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతారు..
ఇంకొందరు.. కూరగాయలను ఇంటి ముంగిటకు తీసుకొస్తారు..
మరికొందరు.. ప్రపంచ సమాచారాన్ని మనకు చేరవేస్తారు..
ఇలా అనేక రంగాల్లో పనిచేసి సూర్యోదయానికి ముందే ఇళ్లకు చేరుకుంటారు.


కూరలు అమ్మేందుకు...

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరమంతా ప్రశాంతంగా కునుకుతీస్తున్న వేళ.. నిత్యం బతుకుదెరువు వెతుకులాటలో పడే సామాన్య మానవుడికి సమయమే తెలియడం లేదు. భార్యాబిడ్డలను పోషించుకునేందుకు పగలు, రాత్రి తేడా లేకుండా కష్టిస్తున్నారు. ప్రతి నిమిషాన్నీ పక్కాగా లెక్క కట్టి కష్టపడి పైసలు సంపాదిస్తేనే బతుకులు సాఫీగా సాగిపోతున్నాయి. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలు, కరుస్తున్న కూరగాయలు, వెలుగునిచ్చే విద్యుత్ దీపాలను వెలిగించినప్పుడల్లా బిల్లులు షాక్ కొడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పగటివేళ పనికి మాత్రమే పరిమితం కాకుండా రాత్రి వేళలోనూ శ్రమించేందుకు వెనకడుగువేయడం లేదు. పనికిపోతే తప్ప పూటగడవని బడుగు జీవులు సాగిస్తున్న జీవన ప్రయాణంపై ఒంగోలు నగరంలో ఆదివారం అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారు జామున 4గంటల వరకు ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించింది.


దుకాణాల వద్ద కాపలా కాస్తున్న సెక్యూరిటీ గార్డులు

### వణికించే చలిలోనూ విధులు

జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. చలి దెబ్బకు ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే గడగడలాడుతున్నారు. ప్రత్యేకించి రెక్కాడితేగాని డొక్కాడని పేద, మధ్య తరగతి బడుగులు వణికించే చలిలోనూ వెనకడుగు వేయడం లేదు. అలా విభిన్న పనులను పొద్దుపొద్దున నగర ప్రజలు నిద్ర లేచేసరికి ముగించి నాలుగు రూపాయలు సంపాదిస్తున్నారు. ప్రత్యేకించి పారిశుధ్య కార్మికులు, పాల ప్యాకెట్ అమ్మకందారులు, పేపర్ బాయ్‌లతోపాటు కూరగాయల వ్యాపారులు, చలి తీవ్రతను ఎదుర్కొంటూ వేకువజామునే వీధుల బాట పడుతుండగా, రాత్రివేళ ఏటీఎం సెంటర్ల వద్ద విధుల్లో కొనసాగే సెక్యూరిటీ గార్డులు, గూర్ఖాలు, పలువురు కూరగాయల దిగుమతి కూలీలు చలికి తల్లడిల్లుతున్నారు. గత నెల వరకు సీజన్ వ్యాధులతో తల్లడిల్లిన ప్రజలు.. ప్రస్తుతం పెరిగిన చలిగాలులతో వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


చేపల మార్కెట్‌లో పనిచేస్తున్న కూలీలు


చలిలో వేడి టీ తయారు చేస్తూ..


కూరగాయలను అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

### వేకువన పని.. పగలు కళాశాలకు...

చదువుతోపాటు ఆటలు, అల్లరి, ఆనందం ఇలా అన్నీ ఉంటేనే యువతరం మరువలేని జ్ఞాపకాలతో సాగిపోతుంది. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పించేందుకు తల్లితండ్రులు పడుతున్న కష్టాన్ని తమ కష్టంగా భావించి కొందరు యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వేకువజామున పనులు చేసుకుంటూ, పగటి వేళ కాలేజీలకు వెళుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ప్రపంచంలోని పలు వార్తా విశేషాలతో ముస్తాబయ్యే దినపత్రికలను ప్రజలు నిద్ర లేవకముందే వారి వాకిట ముంగిట చేర్చడంలో వారు పడుతున్న కష్టం అభినందనీయం. ఎండకు, వానకు తడుస్తూ, ఎముకలను కొరికే చలిలో సైతం ఉపాధే తమ చదువులకు భరోసా అంటూ పరుగులు పెడుతున్నారు. మూడు, నాలుగు గంటలకే నిద్రలేచి, ఉన్నంత సమయంలోనే ఉపాధి బాట పడుతూ, విద్యా ఖర్చులకు ఎంతోకొంత సంపాదించుకోవడం అభినందనీయం.


దినపత్రికను అందిస్తున్న యువకుడు

---

'గ్రానైట్' కుదేలవుతోంది..

## కాపాడండి

- ఎమ్మెల్యే బీఎన్‌కు ఫ్యాక్టరీ యజమానుల మొర
- పోలీసులు, మైనింగ్, విజిలెన్స్ అధికారుల మెరుపు దాడులతో బెంబేలు
- బిల్లులతో వెళ్తున్నా ఏదో సాకుతో సీజ్ చేస్తున్నారంటూ ఆందోళన

చీమకుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలతో గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో ఇచ్చిన మాట మేరకు పరిశ్రమను ఆదుకునేవిధంగా నిర్ణయాలు వెలువడుతాయని ఆశయగా ఎదురుచూశారు. ఈ పరిస్థితుల్లో రెండురోజులుగా పోలీసులు, మైనింగ్, విజిలెన్స్ అధికారుల నుంచి ముప్పేట దాడులు నిర్వహించటం, భారీగా పెనాల్టీలు విధించటంతో గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు బెంబేలెత్తిపోయారు. "బిల్లుతో రవాణా అవుతున్నా.. ఏదో ఒక చిన్నపాటి సాకు చూపించి వాహనాలను సీజ్ చేస్తుండటంతో పరిశ్రమ కుదేలవుతుందని.. మీరే కాపాడాలంటూ ఆదివారం రాత్రి ఒంగోలులో సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ని అసోసియేషన్ నాయకులు కలిసి మొరపెట్టుకున్నారు. వరుస దాడులతో గ్రానైట్ రవాణా స్తంభించిపోయిందని, ఇపుడిపుడే కొనుగోలు ప్రక్రియ ఊపందుకుంటుండగా ఈ విపత్కర పరిస్థితులతో ఫ్యాక్టరీలను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోయారు. పరిష్కారం చూపాలని యజమానులు ఎమ్మెల్యేను కోరారు. జీరో బిల్లుతో వెళ్తున్న వాటిని సీజ్ చేయటంలో తాము ఏమి అనటం లేదని, న్యాయబద్ధంగా బిల్లులతో రవాణా అవుతున్న వాహనాలను చిన్నపాటి సాకులను చూపి సీజ్ చేస్తున్నారని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే బీఎన్, ఎస్పీని కలిసి మీ సమస్యను విన్నవించుకోవాలని సూచించారు. పరిశ్రమ అభివృద్ధికి తన సహకారం ఎల్లపుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. దీంతో నేడో, రేపో ఓనర్ల అసోసియేషన్ నాయకులు ఎస్పీ దామోదర్‌ను కలవాలని తీర్మానించుకున్నారు.

## కుదుటపడిన కర్ణాటక పొగాకు మార్కెట్

**సజావుగా సాగుతున్న వేలం**
**పెరిగిన రోజువారీ కొనుగోళ్లు**
**తగ్గిన నోబిడ్‌లు, గరిష్ఠ ధర కిలో రూ.293**
**సగటు ధర కిలోకు రూ.262**
**ఇప్పటిదాకా 24 మిలియన్ల కిలోలు కొనుగోలు**

ఒంగోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న కర్ణాటక పొగాకు మార్కెట్ కుదుటపడింది. వారం రోజులుగా వేలం ప్రక్రియ సజావుగా సాగుతోంది. రోజువారీ వేలం కేంద్రాలకు వచ్చే బేళ్ల సంఖ్య క్రమంగా పెరుగుతుండగా, అదే సమయంలో నోబిడ్‌ల సంఖ్య కూడా తగ్గుతోంది. తొలుత అత్యధికంగా లోగ్రేడ్ బేళ్లను వేలం కేంద్రాలకు తెచ్చిన కర్ణాటక రైతులు ప్రస్తుతం మీడియం, మేలు రకాలను ఎక్కువగానే తెస్తున్నారు. గరిష్ఠంగా కిలో ధర రూ.293 ఉండగా కనిష్ఠ ధర రూ.200లతో కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 24 మిలియన్ కిలోల కొనుగోళ్లు జరిగాయి. సగటున కిలోకు రూ.262 ధర లభించింది. కర్ణాటకలో 2024-25 సంవత్సరానికి పొగాకు బోర్డు 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా ఇంచుమించు అంతమేర ఉత్పత్తి అయినట్లు సమాచారం.

### మేలు రకానికే డిమాండ్

ఈ సీజన్ కొనుగోళ్లను అక్కడి అన్ని వేలం కేంద్రాలలో ఒకేసారి అక్టోబరు 7న ప్రారంభించారు. తొలుత ఆశాజనకంగానే మార్కెట్ సాగినా అనంతరం సంక్షోభం ఏర్పడింది. గతం కన్నా అధికంగా లోగ్రేడ్ రకం పంట ఉత్పత్తి జరగడం, గతంలో మేలు రకం గ్రేడ్‌లకు వేలం ముగింపు సమయంలో ధరలు పెరగడం వంటి అనుభవాలతో ఈ ఏడాది కర్ణాటక రైతులు వేలం ప్రారంభ సమయంలోనే అధికంగా లోగ్రేడ్ బేళ్లను మార్కెట్‌లోకి తెచ్చారు. ఆ సమయంలో మేలు రకం పొగాకు అవసరం ఉండటంతో వ్యాపారులు ఆ రకం బేళ్లను పోటీపడి కొనుగోలు చేశారు. ప్రారంభంలో కిలోకు రూ.230 ధర ఇస్తూ క్రమంగా రూ.293 వరకు పెంచుకుంటూ వెళ్లారు. అదే సమయంలో లోగ్రేడ్‌లో మంచి బేళ్లను సైతం ధరలను కిలో రూ.230నుంచి రూ.250లోపు మాత్రమే కొనడంతో పాటు కొన్ని రకాల లోగ్రేడ్‌లను అసలు కోనడం మానేశారు. దీంతో రోజువారీ వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్లలో దాదాపు 25శాతం వరకు నోబిడ్(తిరస్కరణ)లు పెరిగాయి. దీనిపై అక్కడి రైతులలో తీవ్ర అలజడి ఏర్పడి గత వారంలో వేలం కేంద్రాలను ముట్టడించే పరిస్థితి వచ్చింది. సంక్షోభం దిశగానే గత నెలాఖరు వరకు మార్కెట్ సాగుతూ రాగా వారం నుంచి కాస్తంత మార్పు వచ్చి మార్కెట్ కుదుటపడి సజావుగా సాగుతోంది. లోగ్రేడ్ ధరలపై పరిస్థితులకు అనుగుణంగా రైతులు నడుచుకొనేలా బోర్డు అధికారులు ఒప్పించినట్లు సమాచారం. తద్వారా రోజువారీ నోబిడ్‌లు తగ్గింపుతో పాటు అధికంగా లోగ్రేడ్ బేళ్లనే కాకుండా కొనుగోలు బాగున్న మీడియం, మేలు రకాలను కూడా అమ్మకాలకు రైతులు తెచ్చేలా చేశారు. అలా ప్రస్తుతం 60శాతం వరకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మీడియం, లోగ్రేడ్ బేళ్లను వేలం కేంద్రాలకు తెస్తుండగా 40శాతం లోగ్రేడ్‌లు తెస్తున్నట్లు సమాచారం.


పొగాకు బేళ్లు

### లోగ్రేడ్‌ల ధరలు కూడా తగ్గకుండా...

ధరలు చూస్తే గరిష్ఠ ధర కిలో రూ.293 పైన కొనసాగుతుండగా మేలురకం, మీడియం తేడా లేకుండా ఆ తరహా బేళ్లన్నింటికీ కిలో రూ.280పైనే ధర ఇస్తున్నారు. అదే సమయంలో లోగ్రేడ్‌ల ధరను కిలో రూ.200కు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లోగ్రేడ్‌లో నాణ్యత ఉన్న బేళ్లకు కిలో రూ.250 వరకు ధర లభిస్తుండగా తక్కువ రకం బేళ్లు రూ.200 పలుకుతున్నాయి. దీంతో రోజువారీ నోబిడ్‌లు తగ్గాయి. గతంలో చాలా కేంద్రాలలో నోబిడ్‌లు 20నుంచి 25 శాతం వరకు ఉండగా ప్రస్తుతం 10శాతానికి తగ్గాయి. మొత్తంగా గత వారంలో పరిస్థితి కాస్తంత కుదుటపడటంతో పొగాకు బోర్డు అధికార వర్గాలు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఇప్పటి వరకు 42 రోజులు వేలం కేంద్రాలు జరగ్గా 24 మిలియన్ల కిలోల పంట విక్రయాలు పూర్తి కాగా సగటున కిలోకు రూ.262 ధర లభించింది. కాగా ప్రస్తుతం పరిస్థితి కుదుటపడటంతో రోజువారీ అమ్మకాలకు తెచ్చే బేళ్ల సంఖ్య పెరిగి రోజుకు ఒక మిలియన్ కిలోల పంట విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం.

## ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

కొండపి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చవటపాలెం గ్రామానికి చెందిన తోపూరి కోటేశ్వరరావు (62) ఆదివారం రాత్రి కనిగిరికి సమీపంలోని గొల్లపల్లి వద్ద ట్రాక్టర్ బోల్తాపడి మృతిచెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం ప్రకారం కోటేశ్వరరావు సీఎస్‌పురం మండలంలోని ఉప్పలపాడు గ్రామం వద్ద 100 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని బర్లీ పొగాకు సాగు చేశాడు. ఈనేపథ్యంలో నీళ్ల కట్టే పైపులు ట్రాక్టర్‌లో తీసుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తు తిరగబడింది. దీంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మరణించాడు. కోటేశ్వరరావుకు ఇద్దరు కుమారులు ఉండగా వారు హైదరాబాద్‌లో ఒకరు బేల్దారి మేస్త్రిగా మరొకరు ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నారు. నిరంతరం కష్టించి పనిచేసే రైతుగా ఈప్రాంతంలో కోటేశ్వరరావు పేరుపొందాడు. కోటేశ్వరరావు మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## క్రీడల ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి : దామచర్ల

- సంతనూతలపాడులో ఉత్సాహంగా కొనసాగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

సంతనూతలపాడు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సాహానికి ఎంతో కృషి చేస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో ఆంధ్రా సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజైన ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్.విజయ్‌కుమార్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ సూదనగుంట ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎన్ఆర్ఐ డాక్టర్ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్ రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఒంగోలులో 20 ఎకరాలు క్రీడల కోసం స్థలం కేటాయించాలని, స్పోర్ట్ అథారిటీకి నివేదికలు పంపామని చెప్పారు. తాను చిన్నతనంలో కబడ్డీ ఇష్టంగా ఆడేవాడినని, ఆ సమయంలో క్రీడల శాఖ మంత్రిగా పనిచేసిన కన్నా లక్ష్మీనారాయణ చేతులమీదుగా స్పోర్ట్స్ ధ్రువీకరణ పత్రం తీసుకున్నారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్ కుటుంబం సంతనూతలపాడులో రూ.కోట్ల విలువైన స్థలాలను విద్యార్థుల భవిష్యత్తు కోసం, ప్రజల కోసం దానం చేసినట్లు గుర్తుచేశారు. తొలుత క్రీడకారులను పరిచయం చేసుకుని పోటీలను తిలకించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సూదనగుంట క్రిష్ణమూర్తి, మందాడి వెంకటేశ్వర్లు, ముప్పరాజు శ్రీనివాసరావు, పావులూరి నారాయణస్వామిచౌదరి, నాయకులు బొమ్మినేని రామాంజనేయులు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, కరిచేటి శ్రీను, ఈదర విష్ణు, సాధినేని శ్రీరామ్మూర్తి, ఆళ్ల రాము, ఆర్.అంకారావు, శంకర్ ఎ.సుమతి పాల్గొన్నారు.


తలపడుతున్న క్రీడాకారిణులు

### హోరాహోరీగా పోటీలు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రెండో రోజు ఆదివారం విజేతల వివరాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తెలియజేశారు.

- పురుషుల విభాగంలో కర్నూలు, విజయనగరం జట్లు తలపడగా కర్నూలు విజయం సాధించింది.శ్రీకాకుళం, ప్రకాశం తలపడగా ప్రకాశం జట్టు గెలిచింది. తూర్పుగోదావరి, నెల్లూరు మధ్య జరిగిన పోటీలో తూర్పుగోదావరి, అలాగే కడప, విశాఖపట్నం మ్యాచ్‌లో విశాఖపట్నం, కర్నూలు, శ్రీకాకుళం మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్లు విజయం సాధించాయి. తూర్పుగోదావరి, చిత్తూరు మ్యాచ్‌లో తూర్పుగోదావరి, అనంతపురంతో తలపడిన కృష్ణా గెలిచింది. గుంటూరు, విశాఖపట్నం తలపడగా గుంటూరు జిల్లా విజేతలుగా నిలిచింది.
- మహిళల విభాగంలో.. తూర్పుగోదావరి, ప్రకాశం జట్లు తలపడగా మ్యాచ్ డ్రా అయ్యింది. ఇక విశాఖపట్నం, పశ్చిమగోదావరి మ్యాచ్‌లో పశ్చిమగోదావరి గెలిచింది. చిత్తూరు, అనంతపురం మ్యాచ్‌లో చిత్తూరు, కర్నూలు, నెల్లూరు మ్యాచ్‌లో కర్నూలు, అలాగే శ్రీకాకుళం, కడప మ్యాచ్‌లో శ్రీకాకుళం, అనంతరం విజయనగరం, అనంతపురం మధ్య జరిగిన మ్యాచ్‌లో విజయనగరం గెలిచింది. విశాఖపట్నంతో ప్రకాశం తలపడగా విశాఖపట్నం విజయం సాధించింది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జట్లు తలపడగా పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, కృష్ణా మ్యాచ్‌లో కృష్ణా జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. రెండు రోజులు పాటు జరిగిన లీగ్‌మ్యాచ్ పోటీల్లో పలువురు నాకౌట్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం ఆల్‌ఇండియా బ్యాడ్మింటన్ ఫెడరేషన్ మాజీ కార్యదర్శి కరణం చెంచుపున్నయ్యచౌదరి, రాష్ట్రస్థాయి మాజీ కబడ్డీ క్రీడాకారులు మచిలీపట్నం ఏఎస్పీ బి.సత్యనారాయణ, పలువురు క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, ట్రెజరర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, రియాజ్



## విశాఖలో పారాగ్లైడింగ్

**» విజయవంతమైన ట్రయల్‌రన్**

సాగర్‌నగర్ (విశాఖపట్నం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని సందర్శించే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు రుషికొండ బీచ్‌లో పారాగ్లైడింగ్ అందుబాటులోకి రానుంది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో లెవెన్ అడ్వెంచర్స్ సంస్థ ఆదివారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ బీచ్‌లో ఇప్పటికే బోటుషికార్, స్కూబా డైవింగ్ తదితర అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అందుబాటులో వున్నాయి. పారాగ్లైడింగ్ కొత్త అనుభూతిని అందించనుంది. నింగి, నేలను తాకుతూ సముద్రంలో ఎగసిపడే కెరటాలు... మరో పక్క ఎత్తైన కొండలను వీక్షిస్తూ నీలాకాశంలో విహరించడం పర్యాటకులకు మధురానుభూతినిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

# అనంత పోలీసుల కస్టడీలో బోరుగడ్డ

**విచారణలో 'తెలియదు, గుర్తులేదు..' సమాధానాలు**



అనంతపురం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆయన్ను ఆదివారం తెల్లవారుజామున అనంతపురం తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులను అసభ్యకరంగా విమర్శిస్తూ బోరుగడ్డ యూట్యూబ్ చానల్‌లో మాట్లాడారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ నిమిత్తం బోరుగడ్డను కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి కోర్టు నుంచి మూడు రోజుల కస్టడీ కోరారు. శనివారం అతనికి వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించారు. కాగా, బోరుగడ్డ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన్ను తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా.. అప్పటికే అక్కడి లైట్లన్నీ ఆర్పేశారు. వచ్చీ రాగానే అనిల్‌ను లోపలకు తీసుకెళ్లారు. ఆదివారం సైతం పోలీసుస్టేషన్‌కు తాళం వేశారు.

### విచారణకు సహకరించని అనిల్

విచారణలో అనిల్ పోలీసులకు సహకరించలేదని సమాచారం. 'తెలియదు.. పెద్దగా గుర్తులేదు..' అనే సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆదివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో విచారించారు. వీఆర్వోల ఎదుట స్టేట్‌మెంట్‌ను తీసుకున్నట్లు తెలిసింది. అనిల్ గతంలో మాట్లాడిన వీడియోల ఆధారంగా 'నువ్వే కదా ఈ వీడియోలో మాట్లాడింది' అని ప్రశ్నించినట్లు తెలిసింది. 3 రోజుల కస్టడీ తర్వాత అతనికి సోమవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరుపరిచిన తర్వాత రాజమండ్రి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రయాణ సమయాన్ని చూపి మంగళవారం ఉదయం అక్కడి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.

## బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

**» 11న రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు**



విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి స్థిరంగా కొనసాగుతోంది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండగా, ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. తరువాత కూడా పశ్చిమ వాయవ్యంగా పయనించి ఈనెల 11వ తేదీనాటికి శ్రీలంక, తమిళనాడు తీరాలకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో 11వ తేదీన రాయలసీమలో విస్తారంగా, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం కోస్తా, రాయలసీమలో ఎక్కువ ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

### అన్నదాతలను అప్రమత్తం చేయాలి: కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కల్లాల్లో ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వరి కోతలు వాయిదా వేసుకునేలా అన్నదాతలను అప్రమత్తం చేయాలని ఆదివారం రాత్రి కలెక్టర్లు, జేసీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రైతులు నూర్చిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వరికుప్పలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు రైతులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని వ్యవసాయశాఖను ఆదేశించారు.

# వెనక'బడి'ంది!




- » ఒక్క పాఠశాలకూ దక్కని 5 స్టార్ రేటింగ్
- » నాలుగు స్టార్లు దక్కిన బడులూ తక్కువే
- » ఏకంగా 398 బడులకు జీరో స్టార్ రేటింగ్
- » సర్కారు స్కూళ్లలో సదుపాయాల లేమి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చాలాచోట్ల మౌలిక సదుపాయాలు ఉంటే సరైన ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న చోట సదుపాయాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల అసలు ఈ రెండూ లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన బడి రాష్ట్రంలో ఒక్కటీ లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాల (లెర్నింగ్ అవుట్‌కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ బడి ఏ స్థాయిలో ఉంది? అనే కోణంలో వివరాలు సేకరించడంతో ఇప్పటివరకూ వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఉత్తదేనని తేలిపోయింది. బడుల్లో మౌలిక సదుపాయాలకు 5 స్టార్లు, అభ్యసన ఫలితాలకు 5 స్టార్లు ప్రామాణికంగా ఈ అధ్యయనం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 45,087 ఉంటే... వాటిలో ఏ ఒక్కటి కూడా కనీసం ఒక విభాగంలోనూ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. మరోవైపు సదుపాయాల్లో 87, అభ్యసన ఫలితాల్లో 311 బడులకు అసలు రేటింగే దక్కని (జీరో రేటింగ్) దారుణమైన స్థితిలో ఉన్నాయి.

### సొంత భజనతో సరి

రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంది. 'నాడు- నేడు'తో బడి స్వరూపాన్ని మార్చేశామని జగన్ పదే పదే సొంత భజన చేసుకున్నారు. తీరా ఇప్పుడు మౌలిక సదుపాయాల విభాగంలో ఒక్క పాఠశాల కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. అదేవిధంగా అభ్యసన ఫలితాల్లో సైతం ఒక్కటీ ఫైవ్ స్టార్ సాధించకపోగా, కేవలం 41 పాఠశాలలు మాత్రమే ఫోర్ స్టార్ సాధించాయి. మిగిలిన 45 వేల పైచిలుకు బడులన్నీ త్రీ స్టార్, అంతకంటే తక్కువ స్థాయికే పరిమితమయ్యాయి.

> విద్యారంగంలో సంస్కరణల పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం పాఠశాలలను దీన స్థితిలోకి నెట్టేసింది. చదువులను గాలికొదిలి టోఫెల్, బైజూస్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యా ప్రమాణాలను దారుణంగా దెబ్బతీశాయి. విద్యార్థుల హాజరు, ఫలితాలను పట్టించుకోకుండా టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో పాటు బోధన సమయాన్ని తగ్గించడంతో పిల్లల చదువులు అటకెక్కాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మార్చేస్తామని ప్రగల్భాలు పలికినా.. ఆ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో బడుల్లో మౌలిక సదుపాయాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయని తేలిపోయింది. గత ప్రభుత్వం తీరుతో ఇప్పుడు పాఠశాలలు సింగిల్ స్టార్ దక్కించుకోవడానికే ఆపసోపాలు పడుతున్నాయి.

### స్టార్ రేటింగ్ ఇలా...

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితరాలను పరిశీలించారు. ఒక్కో అంశానికి 5 చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన బడులకు 5 స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదో తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40 శాతం, ఫలితాలకు 60 శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండూ కలిపి 90 శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలున్న బడులకు 1 నుంచి 4 స్టార్లు కేటాయించారు.

### అన్ని జిల్లాల్లోనూ అదే తీరు

ప్రభుత్వ పాఠశాలల స్థితి దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ ఒకేలా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 2,913 బడులకు గాను 161 చోట్ల మాత్రమే మౌలిక సదుపాయాలు పరవాలేదన్నట్టుగా ఉన్నాయి.

**బడులకు ఇచ్చిన రేటింగ్‌లు ఇలా..**

| స్టార్ రేటింగ్ | మౌలిక సదుపాయాలు | అభ్యసన ఫలితాలు |
|---|---|---|
| జీరో స్టార్ | 87 | 311 |
| ఒక్క స్టార్ | 1,958 | 14,095 |
| టూ స్టార్ | 16,816 | 26,272 |
| త్రీ స్టార్ | 19,438 | 4,368 |
| ఫోర్ స్టార్ | 6,788 | 41 |
| ఫైవ్ స్టార్ | 0 | 0 |


అయితే అభ్యసన ఫలితాలు మాత్రం దిగజారిపోయాయి. ఈ విభాగంలో ఒక్క బడి కూడా నాలుగు స్టార్లు సాధించలేదు. అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, కాకినాడ, కర్నూలు, ఎన్టీఆర్, నెల్లూరు, శ్రీసత్యసాయి, విశాఖ జిల్లాల్లోనూ ఒక్క పాఠశాలకూ నాలుగు స్టార్లు దక్కలేదు. ఎక్కువ పాఠశాలలు రెండు, మూడు స్టార్లతోనే సరిపెట్టుకున్నాయి.

### ఫలితాల్లేని సదుపాయాలెందుకు?

వైసీపీ ప్రభుత్వం బడులను రాజకీయ ప్రచారానికి వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికొదిలేసింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్లక్ష్యం చేసింది. టీచర్లకు నాడు- నేడు పనులు, మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను పెడచెవిన పెట్టింది. పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్టుగా మార్చేసి, ఫలితాలను దిగజార్చింది.

## నవ్య | చిత్రజ్యోతి

## పోరాట వీరుడి కథ



విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు. కాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్ సేతుపతి చెన్నైలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'పెరుమాళ్ అనే పాత్రలో విజయ్ సేతుపతి అభినయం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. పెరుమాళ్ పోరాట వీరుడిగా ఎలా మారాడు అనేది ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రంలో వెట్రిమారన్ ప్రజెంట్ చేశారు. తెలుగులో విజయ్ సేతుపతికి ఎందరో అభిమానులు ఉన్నారు. ఈ చిత్రంలో ఎమోషన్స్, యాక్షన్ అన్నీ రియాల్టీకి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటుంది' అని అన్నారు. మంజువారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్, రాజీవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. కాగా, గతేడాది రిలీజైన 'విడుదల' పార్ట్ 1 చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకొని సూపర్ హిట్‌గా నిలిచింది.

## యాక్షన్ థ్రిల్లర్



పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. 10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వజ్, హీరోయిన్ జ్యోతి పూర్వజ్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిల్మ్ సిటీ, మొయినాబాద్ లోకేషన్స్‌లో జరిగే ఈ చిత్రీకరణలో గౌతమ్, జ్యోతి పూర్వజ్ పాల్గొంటారు.

## డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్



తెలుగు ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రకాశ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. అధ్యక్షుడిగా ప్రకాశ్ ఎన్నికవడం ఇది ఐదోసారి. కాగా, జానీని అధ్యక్షుడిగా తొలగించడంతో పాటు ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే జానీపై పోక్సో కేసు విచారణలో ఉండటం, అసోసియేషన్‌లో జానీ ప్రవర్తన అగ్రెసివ్‌గా ఉండేదనే రిపోర్టు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# మోహన్‌బాబు.. మనోజ్ మధ్య గొడవ?





సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య ఆస్తుల పంపకాల విషయంలో గొడవ జరిగినట్లు మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ విషయం సినీ ఇండస్ట్రీతో పాటు.. అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పహాడీషరీఫ్ పరిధిలోని మోహన్‌బాబు ఇంట్లో ఆస్తుల పంపిణీ జరుగుతున్న క్రమంలో స్కూలుకు సంబంధించిన వాటాల్లో విభేదాలు తలెత్తి మోహన్‌బాబు అనుచరులు వినయ్ ఇతర బౌన్సర్లు మనోజ్‌పై, ఆయన భార్య మౌనికపై దాడికి పాల్పడి గాయపరిచినట్లు.. గాయాలతోనే మనోజ్ తన భార్యతో కలిసి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై మహేశ్వరం డీసీపీని సంప్రదించగా డయల్-100కు కాల్ వచ్చిందని, వ్యక్తిగతంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. కాలుకు గాయం అయిన మంచు మనోజ్ తన భార్య మౌనికతో కలిసి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. తండ్రితో జరిగిన గొడవ విషయమై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మనోజ్, మౌనిక మాట్లాడటానికి నిరాకరించారు. కాగా, మనోజ్ ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో డిశ్చార్జి అయ్యారు. మనోజ్‌కు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) పూర్తి చేసిన వైద్యులు ఆయన ఒంటిపై అనుమానాస్పద దెబ్బలు ఉండటంతో ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాలు, మెడ భాగంలో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారని తెలిసింది. సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ పరీక్షలు పూర్తి చేసిన వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించగా.. సోమవారం మరోసారి ఆస్పత్రికి వస్తానని మనోజ్ డిశ్చార్జి అయినట్లు తెలిసింది.

### అంతా అబద్ధం : మోహన్‌బాబు

ఆస్తుల పంపకాల్లో మా ఇంట్లో గొడవలు జరిగాయని.. మనోజ్‌ను నేను కొట్టానని ఉదయం నుంచి మీడియాలో షికార్లు చేస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేయొద్దంటూ మీడియాకు సూచించారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

## 14న ఎన్టీఆర్ సినీ ప్రస్థాన వజ్రోత్సవం



నందమూరి తారకరామారావు సినీ ప్రస్థాన వజ్రోత్సవం ఈ నెల 14న పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుందని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల చైర్మన్ టీడీ జనార్దన్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్ హాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో టీడీ జనార్దన్ మాట్లాడుతూ "సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌కు సాటి లేదు. కృష్ణుడిగా, రాముడిగా నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన తొలిసారి నటించిన 'మనదేశం' చిత్రం 75 ఏళ్ల అయిన సందర్భంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ కుమారుడు రమేశ్ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు చిత్ర పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌తో పాటు 24 క్రాఫ్ట్స్‌తో పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, సెక్రటరీ దామోదర్ ప్రసాద్, ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు అనుపమరెడ్డి, ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

- ధర్నాచౌక్, విజయవాడ (ఆంధ్రజ్యోతి)

## ఒక్కసారి ప్రేమిస్తే చాలు




బాలీవుడ్ సీనియర్ నటి రేఖ రీసెంట్‌గా ఓ రియాల్టీ షోలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక అంశాలను పంచుకున్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే ప్రేమలో పడతారని కవులు తమ రచనల్లో రాస్తే...మరికొందరు మాత్రం ప్రేమకు ఆది, అంతం లేదంటున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి అని యాంకర్ రేఖను ప్రశ్నించగా..'నా మటుకు, ఆ వ్యక్తి సరైన వాడైతే... ఒక్కసారి ప్రేమిస్తే చాలు' అని బదులిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానంగా నిజమైన ప్రేమకు నిర్వచనం చెబుతూ 'ఎవరినైనా ప్రేమించండి, నా వరకైతే నేను మొదట అన్నిటినీ ప్రేమిస్తాను. నా వృత్తిని, నా స్నేహితులను, ఈ ప్రపంచాన్ని, ప్రకృతిని ఇలా..ప్రతీదాన్ని ప్రేమిస్తాను. కానీ, నన్ను నేను ఎక్కువగా ప్రేమిస్తా' అని చెప్పుకొచ్చారు. రేఖ మాటలు విన్న ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు.



## మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి

ఇటీవలే 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ప్రస్తుతం ఆమె మరో వెబ్ సిరీస్ 'రక్త్‌బ్రహ్మండ్'లో నటిస్తున్నారు. 'ద బ్లడీ కింగ్‌డమ్' అనేది ఉపశీర్షిక. తాజాగా, కొద్ది గ్యాప్ తర్వాత ఈ సిరీస్ సెట్స్‌లోకి ఆమె తిరిగి అడుగుపెట్టారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బ్యాక్ టూ యాక్షన్ మోడ్ అని పేర్కొన్నారు. 2018లో విడుదలైన హారర్ చిత్రం 'తుమ్‌బాడ్'తో గుర్తింపు తెచ్చుకున్న అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యాంటసీ వెబ్‌సిరీస్‌ను రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. ఈ నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, ఆలీ ఫాజల్, వామికా గబ్బీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



## అరకులో మాస్ జాతర

రవితేజ నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. 'సామజవరగమన' రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఆఫీసర్ పాత్రలో రవితేజ నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. సినిమా తాజా షెడ్యూల్ డిసెంబరు మూడో వారంలో అరకులో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఆ తరవాత పాడేరు, ఆంధ్రా-ఒడిషా సరిహద్దు లొకేషన్స్‌లో చిత్రీకరణ జరగనున్నట్లు తెలిసింది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## అసత్య ప్రచారాన్ని ఆపండి

**- రెహమాన్ కుమార్తె ఖతీజా**



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన భార్య సైరా బానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయనపై పలు ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు రెహమాన్ కుటుంబ సభ్యులు తిప్పికొడుతూనే ఉన్నారు. అయితే రీసెంట్‌గా మరో వార్త వైరల్ అవుతోంది. వైవాహిక బంధానికి స్వస్తి పలికిన రెహమాన్..సంగీతానికి కొంత కాలం దూరంగా ఉండనున్నారంటూ కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. రెహమాన్ మ్యూజిక్‌ని మిస్ అవ్వాల్సిందేనా? అంటూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు పోస్టులు పెట్టారు. ఈ వార్తలపై ఇప్పటికే రెహమాన్ కుమార్తె ఖతీజా 'ఎక్స్' వేదికగా స్పందించారు. అయినా రూమర్లు ఆగకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మరోసారి రియాక్ట్ అయ్యారు. 'దయచేసి అసత్య ప్రచారాన్ని ఆపండి' అని విజ్ఞప్తి చేశారు. వార్తను ప్రచురించిన ఓ మీడియాను కోట్ చేస్తూ అలా రాయడం సబబు కాదన్నారు.

## అవీ..ఇవీ

### బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాలు

కంభం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నెలరోజులుగా బంగ్లాదేశ్‌లో అల్లరిమూకలు హిందువులపై చేస్తున్న దాడులకు నిరసనగా పట్టణంలో హిందూ సంఘాలు నిరసన తెలిపాయి. హిందువులపై దాడులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం కంభం పట్టణంలో హిందూ సంఘాలు భారీగా శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టాభిరామస్వామి దేవాలయం నుంచి మెయిన్ బజారు, చౌక్ సెంటర్, కందులాపురం మీదుగా ఈ ర్యాలీ నిర్వహించారు. హిందూ సంఘ నాయకులు మాట్లాడుతూ అల్లరిమూకలు దేవాలయాలపై దాడులు నిర్వహించి ఆస్తులను ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. ఈ దాడులు చేసి ప్రాణాలు తీస్తున్న వారిపై బంగ్లాదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హిందువులకు, వారి ఆస్తులకు, దేవాలయాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు బాదం మనోహర్, పల్లెం శ్రీనివాసులు, వేముల శ్రీను, ఆర్ఎస్ఎస్ నాయకులు లక్ష్మీనారాయణ, విశ్వహిందూ పరిషత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### హిందూ సమ్మేళనం

గిద్దలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం చోళ్లవీడులోని శ్రీపట్టాభిరామస్వామి దేవాలయంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. హిందూ సమ్మేళన జిల్లా కన్వీనర్ బండారు మాధవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విజయవాడలో జనవరి 5న జరుగనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి ప్రతి హిందువు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ నెలలో వచ్చే పౌర్ణమి రోజున ప్రతి గ్రామంలో సామూహిక హారతి ఇచ్చి హైందవ శంఖారావం గురించి తెలియజెప్పాలన్నారు. సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు శిలమల్లారెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రసాద్, రమణ, కృష్ణారెడ్డి, పురోహితులు మనోహర్‌శర్మ పాల్గొన్నారు.

### ఘనంగా ఘంటసాల జయంతి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతిని త్రివిక్రమ అభ్యుదల కళాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గాయకులు పురాణం సుబ్రహ్మణ్యం, జిల్లెల్ల వెంకటేశ్వర్లు, చిత్తారి రంగనాయకులు ఘంటసాల పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో పేరం సత్యనారాయణ, శీలం రామకృష్ణారెడ్డి, ఎంవీ రమణ, కొండలు, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

### నేడు వైసీపీ మండల నేతల సమావేశం

• ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహణ

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినుకొండ రోడ్డులో వైష్ణవి గార్డెన్స్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వైసీపీ ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధ్వర్యంలో ఐదు మండలాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల నాయకులు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అలాగే సాయంత్రం 6 గంటలకు సెమీక్రిస్మస్ వేడుకల కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. ఆయా కార్యక్రమాలకు ఐదు మండలాల మండల పార్టీ నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు సర్పంచ్‌లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.





ఇటీవల కురిసిన వర్షాలకు గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉన్న వర్షపునీరు

## గిద్దలూరు బస్టాండ్‌లో మినీ తటాకాలు

గిద్దలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షం కురిసిన ప్రతిసారి గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు మిని తటాకాలను తలపిస్తున్నాయి. బస్టాండ్ పరిసరాల్లో పొల్లు ప్రాంతాలు ఉండడంతో వారాల తరబడి నీరు నిలబడి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లాలంటే వర్షం బురద నీటి నుంచే ప్రయాణికులు లోపలికి వెళ్లాల్సి వస్తోంది. బురదనీరు నిల్వ ఉండడంతో దోమలు ఉధృతి పెరుగుతోంది. బస్సుల కోసం వేచియుండే ప్రయాణికుల రక్తాన్ని పీలుస్తుంటాయి. ఇక ఈ పరిసర ప్రాంతాల్లో దోమల ఉధృతికి కూడా ఈ నీటి నిల్వలు కారణం అవుతున్నాయి. అధికారులు వర్షం నీరు బయటకు వెళ్ళే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదే విధంగా ఖాళీ ప్రాంతాల్లో మెరక తోలి నీరు నిల్వకుండా చూడాలని కోరుతున్నారు.

## అయ్యప్పకు వైభవంగా విళక్కి పూజ

**ఆకట్టుకున్న అభిషేక సేవలు**

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారికి ఆదివారం విళక్కిసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, కలశస్థాపన చేశారు. అనంతరం స్వామికి పాలాభిషేకం, పెరుగాభిషేకం, నెయ్యాభిషేకం, తేనాభిషేకం, చెక్కరాభిషేకం, పండ్లరసాభిషేకం, భస్మాభిషేకం, పసుబాషేకం, గంధాభిషేకం, కుంకుమాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు వక్కలగడ్డ మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. రాత్రి స్వామికి సన్నాయి, కేరళ వాయిద్యాలు, భాజా భజంత్రీలు, విచిత్ర వేషధారణల మధ్య దీపోత్సవం చేశారు. నడుమ స్వామికి పులివాహనంపై నగరోత్సవం నిర్వహించారు. అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షులు తాడువాయి గోపాలమల్లికార్జున రావు, అయ్యప్ప సేవాసంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

**రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన**

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక కొండేపల్లి రోడ్డులో నూతనంగా నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మర్రి రూఫస్, టీడీపీ నాయకులు మర్రి కొండలు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి, పూజల్లో పాల్గొన్న ఇమ్మిడి కాశీనాథ్, జంకె వెంకటరెడ్డి, రామాలయం శంకుస్థాపన కార్యక్రమం

## పోలేరమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయం పైకప్పు స్లాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణం అర్థవీడు రోడ్డులోని శ్రీమడియాలేశ్వరస్వామి ఆలయం, నాగపోలేరమ్మ ఆలయాలలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆదివారం నాగపోలేరమ్మ నూతన ఆలయానికి పైకప్పు స్లాబ్‌ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంభం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పోలేరమ్మకు ఆదివారం జాతర**

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

### నేడు ఎల్.కోటలో రెవెన్యూ గ్రామసభ

కంభం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 10గంటలకు మండలంలోని ఎల్.కోట పంచాయతీలో నిర్వహించే రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొంటున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు తోట వెంకట శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం కంభం ప్రభుత్వ వైద్యశాలను పరిశీలిస్తారన్నారు. కావున టీడీపీ, బీజేపీ, జనసేన మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

## కిరాణా దుకాణంలో నగదు చోరీ



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

పొదిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో విశ్వనాథపురంలోని ఓ కిరాణ దుకాణంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈ చోరీలో భారీమొత్తంలో నగదు పోయినట్లు బాధితుడు కోటి తెలిపారు. తాను రోజులాగే దుకాణం మూసివేసి శనివారం రాత్రి ఇంటికి వెళ్లానన్నారు. ఆదివారం ఉదయం తన పక్కదుకాణం వ్యక్తి వచ్చి చూసేసరికి తన దుకాణం షెట్టర్ తొలగించి ఉందన్నారు. దీంతో ఆయన తనకు సమాచారం ఇచ్చాడన్నారు. తాను దుకాణానికి వచ్చి చూడగా, షెట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. అనంతరం ఎస్ఐ వేమన దుకాణాన్ని పరిశీలించారు. దుకాణంలో బంగారం కొను గోలు కోసం నిల్వ ఉంచిన రూ.4.70 లక్షల నగదు చోరీకి గురైందని బాధితుడు తెలిపారు. అనంతరం క్లూస్‌టీం సిబ్బందిని పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కోటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అంతేకాకుండా అదేవీధిలో మరో కిరాణా దుకాణం తాళాలు పగులగొట్టేందుకు దుండగులు ప్రయత్నించారు ఆ షెట్టర్ తాళాలు రాకపోవడంతో వదిలి వెళ్లారని ఆయన తెలిపారు. మరో కిళ్లీ దుకాణం తాళాలు పగలగొట్టి రూ.2500ల నగదు తీసుకెళ్లినట్లు తెలిపారు.

## వేతనాలు మంజూరు చేయాలి

**ఇమామ్‌లు, మౌజన్ల వినతి**



సమావేశంలో పాల్గొన్న ఇమామ్‌లు, మౌజన్లు

గిద్దలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బిలాల్ మసీద్ ఆవరణలో మసీదులలో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్లు సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్ గుడిసె మహబూబ్‌భాషా మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా మౌజన్‌లకు, ఇమామ్‌లకు ప్రభుత్వం నుంచి వేతనాలు రావడం లేదన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే వేతన బకాయిలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఇమామ్, మౌజన్‌ల వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు పఠాన్ జఫ్రుల్లాఖాన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వమైనా షాదీఖానాలు, స్మశానాలు, ఈద్‌గాలు, ప్రహరీగోడలకు నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గోల్కొండ చాంద్‌బాషా, సయ్యద్ ఖాశిం, షేక్ ఖాశిం, తదితరులు పాల్గొన్నారు.

## జనావాసాల మధ్య కొండచిలువ సంచారం

**పట్టుకొన్న స్నేక్‌క్యాచర్ నిరంజన్‌రెడ్డి**

మార్కాపురం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నికరంపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి కొండచిలువ కలకలం సృష్టించింది. భారీ కొండచిలువ గ్రామంలోని రావడంతో గ్రామస్థులు హడలిపోయారు. స్థానికులు వెంటనే అటవీ శాఖ సిబ్బంది స్నేక్ క్యాచర్ నిరంజన్‌కు సమాచారం అందిచారు. స్పందించిన ఆయన వెంటనే నికరంపల్లి గ్రామానికి చేరుకుని పశువుల పాకలో ఉన్న కొండచిలువను చాకిచక్యంగా పట్టుకున్నాడు. గోనె సంచిలో వేసి అడవులలో వదులు తామని తెలిపారు. సమాచారం అందిన వెంటనే గ్రామానికి వచ్చి కొండచిలువను పట్టుకున్న నిరంజన్‌ను గ్రామస్థులు అభినందించారు. మీ పరిసరాలలో ఎక్కడైనా పాములు సంచరిస్తున్నట్టు గమనిస్తే వాటికి హాని తలపెట్టకుండా తనకు సమాచారం ఇవ్వాలని కోరారు.



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్

### నేడు సమ్మద్ బాష ప్రమాణస్వీకారం

పెద్దదోర్నాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 9న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ మేరకు టీడీపీ ఒంగోలు పార్లమెంటు మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సమ్మద్ బాష విలేకర్లతో మాట్లాడారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి మైనార్టీ అనుబంధ కమిటీలలోని సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో షేక్ సత్తార్, పఠాన్ సత్తార్ హాజీ, మొగల్ రఫీ, డీ దర్గయ్య, షేక్ మౌలాలి, దావూద్, యునూ సుబానీ,షేక్ జుబేర్ పాల్గొన్నారు.

## గుండంచర్లలో రేషన్ బియ్యం స్వాధీనం

పెద్దారవీడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంచర్లలో అక్రమంగా నిల్వ ఉంచిన 34 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. ఆదివారం మార్కాపురం సబ్‌కలెక్టరు ఆదేశాల మేరకు గుండంచర్ల గ్రామంలో రెండు ఇళ్లలో తనిఖీ నిర్వహించారు. 75 బస్తాల్లో ఉన్న 34 క్వింటాళ్ల బియ్యంను పరిశీలించారు. పీడీఎస్ బియ్యంగా తేల్చి ఆ బియ్యాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక రేషన్ డీలరు వద్ద భద్రపరిచారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ ఖలీల్, ఆర్ఐ గోపి, వీఆర్వో గురవయ్య పాల్గొన్నారు.



అధికారులు సీజ్ చేసిన రేషన్‌బియ్యం

## జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ఒంగోలులోని ఎస్‌టీకేఆర్ ఓ రియంటల్ స్కూలులో జరిగి న కార్యవర్గ సమావేశానికి పరిశీలకులుగా ఎస్.మురళీ, జిల్లా పరిశీలకులుగా డీఎల్ఎన్.రెడ్డి, సీబీమైకల్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్‌గా తోపూరు సుబ్బారావు, చీఫ్ ప్యాట్రన్‌గా మండవ వెంకటస్వామి, పాట్రన్‌గా ఈదర సుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆళ్ల వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా సోమినేని సురేష్, జనరల్ సెక్రటరీగా ఆళ్ల రామ్మోహన్, , కోశాధికారిగా నెప్పల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటస్వామి, పి.రాజేష్ కుమార్, ఎస్.శ్రీనివాసరావు, వెంకటశేషయ్య, బాలాజీ, జాయింట్ సెక్రటరీలుగా వెంకటేశ్వర్లు, పి.మురళి, జి.సురేష్, మోహన్‌రావు, ఎస్.కోటేశ్వర రావులు ఎన్నికయ్యారు.

### చిరు జల్లులకే వీధులన్నీ ఇలా!

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెంలో చిరు జల్లులకే పట్టణంలోని వీధులు బురదమయంగా మారుతున్నాయి. ఇటీవల ఉదయం కొద్దిపాటి చిరుజల్లులు కురిశాయి. ఈ చిరు జల్లులకు పుల్లలచెరువు రోడ్డులోని గాయత్రి థియేటర్‌కు వెళ్లే వీధి, బ్రహ్మంగారి వీధి, ప్రధాన వీధి తదితర వీధుల్లో నీరు నిలిచింది. దీంతో ఆయా వీధులలో పాఠ శాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురికి నీరు రోడ్డుపై లేకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



వర్షంనీటిలో ఉన్న గాయత్రీ థియేటర్ వీధి (ఫైల్)

### క్రిస్మస్ సందడి ప్రారంభం

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెంలో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. క్రైస్తవ ప్రార్థనామందిరాలు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. పలు దుకాణాల వద్ద క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో క్రిస్మస్ సందడి నెలకొంది. ఇక టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వినుకొండ రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు.



దుకాణాల్లో సిద్ధంగా ఉన్న ట్రీ

### ఎదురెదురుగా రెండు కార్లు ఢీ

పొదిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని తలమళ్ల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గిద్దలూరు వైపు నుంచి మర్రిచెట్లపాలెం, ఒంగోలు వైపు నుంచి గిద్దలూరు వెళుతున్న రెండుకార్లు మండలంలోని తలమళ్ల వద్ద ప్రమాదవశాత్తు ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అంజిరెడ్డి, రమణారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చీమకుర్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.



రోడ్డుకు ఇరువైపుల పడిన కార్లు

## మంచుదుప్పట్లో గిద్దలూరు

గిద్దలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ప్రాంతంలో మంచు దుప్పటి కనిపించింది. ఆదివారం తెల్లవారుజామున 5గంటల నుండి ఉదయం 9గంటల వరకు పొగ మంచు దట్టంగా వ్యాపించింది. దీంతో పట్టపగలు సూర్యుడు వచ్చిన తరువాత కూడా పొగమంచు కారణంగా ఎదు రుగా వచ్చే వాళ్లు కూడా కనపడని పరిస్థితి పలు రోడ్ల పై కనిపించింది. పట్టణ శివార్లలో, కొండల వద్ద, వీధు ల్లో పొగమంచు దృశ్యాలు అందరినీ అలరించాయి. రెండు రోజులుగా మంచుదుప్పటి గిద్ద లూరుపై కప్పబడడంతో ఆహ్లాద కర వాతావరణం కనిపిస్తోంది.



ఉదయం ఏడుగంటల సమయంలో మంచు



సూర్యోదయం అయినా వీడని మంచు తెరలు

కంభం : కంభం పట్టణంలో ఆదివారం వేకువజామున పొగమంచు కమ్మేసింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. జాతీయ రహదారిపై వాహనచోదకులు పలువురు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## ముఖాముఖి

### భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**బీవీ రమణారావు, తహసీల్దార్, పామూరు**



ప్రశ్న: రెవెన్యూ సదస్సులతో ప్రయోజనం ఉందా?

జవాబు: రైతుల సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నది.

ప్ర: రీసర్వే గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి?

జ: మండలంలో ఇప్పటివరకు ఆరు గ్రామాల్లో రీసర్వే నిర్వహించాం. గతంలో జరిగిన రీ సర్వేపై అభ్యంతరాలు ఉన్న చోట రైతుల నుంచి రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు స్వీకరిస్తున్నాం.

ప్ర: ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై చర్యలు తీసుకుంటున్నారా?

జ: ప్రభుత్వ స్థలాలు, భూముల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకొంటాం.

ప్ర: రెవెన్యూలో ప్రతి పనికి ముడుపులు అడుగుతున్నారనేఆరోపణలు ఉన్నాయి?

జ: ఎవరికి ఎలాంటి ముడుపులు ఇవ్వాల్సిన అవసరంలేదు, ఎవరైనా డబ్బులు అడిగితే నేరుగా తన దృష్టికి తీసుకురావాలి.

ప్ర: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రైతుల జాబితా సిద్ధం చేశారా?

జ: సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రైతుల జాబితాను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించాం.

### వర్గీకరణలో సామాజిక న్యాయం లేదు!

పీసీపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో సామాజిక న్యాయం లేదని మాలల జేఏసీ కన్వీనర్ బాలనారాయణ, శాంతరాజ్ అన్నారు. ఈనెల 15న గుంటూరులో జరగనున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం మండలంలోని రామాపురంలో సర్పంచ్ శాంసన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉమ్మడిగా ఉన్న షెడ్యూల్ కులాలను విభజించి కొంతమంది ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బాదుర్ల రమణ, యానాది, చిన్నయ్య, సుబ్బారావు, శ్రీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముండ్లమూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామంలో ఆదివారం నవధాన్యాల సాగు, విత్తన గుళికల తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ప్రధాన పంటలకు ముందుగా భూసారం కోసం పీఎండీఎస్‌లో వేసే నవ ధాన్యాలు, విత్తన గుళికలు తయారు చేసే విధానంపై సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రఘురామిరెడ్డి అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ జె.ప్రభాకర్, ఎస్‌డీపీ వెంకటరమణ, నాగిరెడ్డి, మురళీ, మూర్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి దోపిడీపై చర్యలు నిల్

» విచారణ పేరుతో కాలయాపన చేస్తున్న అధికారులు

దర్శి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కొండలు, ప్రభుత్వ భూముల్లో మట్టి దోపిడీపై అధికారులు చర్యలు తీసుకోవటంలో వెనుకంజ వేస్తున్నారు. గత రెండేళ్లుగా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారని భావించినప్పటికీ అధికారుల్లో చలనం లేదు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ళ కాలంలో దర్శి ప్రాంతంలోని లంకోజనపల్లి కొండ, చందలూరు కొండ, తానంచింతల కొండ, వెంకటచలంపల్లి కొండల మట్టి కొల్లగొట్టారు. బొట్లపాలెం రెవెన్యూలోని పశువుల మేత పోరంబోకు భూమిలో సుమారు 70 ఎకరాల్లో మట్టిని తోడేశారు.



గత ప్రభుత్వ హయాంలో లంకోజనపల్లి కొండ మట్టి తవ్వకాలతో ఏర్పడిన గోతులు

అక్రమార్కులు మట్టి దోపిడీ చేస్తున్న విషయాన్ని బొట్లపాలెం, చందలూరు గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే జిల్లా అధికారులు బొట్లపాలెం పశువుల మేత పోరంబోకు భూమిలో మట్టి తవ్విన ప్రాంతాలను పరిశీలించారు. అలాగే, మట్టి తోడేసిన కొండలను పరిశీలించారు. దీంతో అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారని భావించినప్పటికీ ఆతర్వాత పట్టించుకున్న నాథుడు లేడు. విచారణ పక్కన పెట్టారు. కొంతమంది అధికారులు బదిలీ అయ్యారు. కొత్త అధికారులు ఆ విషయాలను గురించి పట్టించుకోకపోవటంతో విచారణ నీరుగారిపోతుంది. ఇప్పటికైనా అధికారులు గతంలో జరిగిన సంఘటనపై దృష్టిసారించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పోలీసుశాఖకు డ్రోన్ కెమెరా బహూకరణ

» రాజంపల్లి వాసిని అభినందించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

దర్శి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ కేసులను ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్న విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు డ్రోన్ కెమెరాల సహకారంతో కేసులను త్వరగా ఛేదించవచ్చని ఆదిశగా సాంకేతికపరమైన సహకారాన్ని పోలీసుశాఖ అందిస్తున్న విషయం తెలిసిందే. అందుకు స్పందించి మండలంలోని రాజంపల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఐ తానికొండ వెంకటరావు అత్యాధునిక సాంకేతికతో కూడిన డ్రోన్ కెమెరాను దర్శి పోలీసుశాఖకు అందజేశారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ చేతుల మీదుగా ఆదివారం ఒంగోలులో డ్రోన్ కెమెరాను దర్శి సీఐ వై.రామారావు, ఎస్సై ఎంమురళీలకు అందజేశారు.



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్, పాల్గొన్న దర్శి పోలీసులు

ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ పోలీసుశాఖకు సహకారం అందిస్తుండటం పట్ల అభినందనలు తెలిపారు. అసాంఘిక శక్తులను అణచి వేసేందుకు, సమాచారాన్ని కనుగొనేందుకు డ్రోన్ కెమెరాలు డేగ కన్నులాగ ఉపయోగపడుతాయన్నారు. డ్రోన్ కెమెరాను బహూకరించిన వెంకటరావును ఆయన అభినందించారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# మంచినీటి సరఫరా బంద్

» రామతీర్థం వద్ద మరమ్మతులకు గురైన మోటార్లు

» పది రోజులుగా అవస్థలు పడుతున్న పలుగ్రామాల ప్రజలు

తాళ్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాలకు గత పది రోజులుగా రామతీర్థం మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు దాహార్తితో తల్లడిల్లుతున్నారు. రామతీర్థం జలాశయం నుంచి గ్రామాలకు నీటిని సరఫరా చేసే మోటార్లు చెడిపోవటంతో గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. గ్రామాల్లోని బోర్లలో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉండటంతో మంచినీటి ట్యాంక్‌లను నిర్మించి సరఫరా చేస్తున్నారు. రామతీర్థం రిజర్వాయర్ ద్వారా గ్రామాల్లోని మినీ వాటర్ ట్యాంక్‌లకు మంచినీరు సరఫరా చేస్తున్నారు.

రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉండి నీటి సమస్య ఉండదని ప్రజలు భావిస్తున్న తరుణంలో మోటార్లు చెడిపోయి పది రోజులు కావస్తున్నా మరమ్మతులు చేయలేదు. దీంతో రామతీర్థం జలాశయం నుంచి మంచి నీరు సరఫరా నిలిచిపోయింది. గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లు గ్రామస్థులందరికి నీరు అందించలేకపోవటంతో రామతీర్థం వాటర్‌పై ఆధారపడుతున్నారు. పది రోజులలగా మంచినీరు నిలిచిపోవటంతో ప్రజలు మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. కొందరు మాత్రం వ్యయప్రయాసలకోర్చి వాటర్ ప్లాంట్‌ల వద్దకు వెళ్లి మంచినీరు తెచ్చుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేనివారు గత్యంతరంలేక గ్రామాల్లో ఫ్లోరిన్ ఉన్న బోరు నీటిని ఉపయోగించుకుంటున్నారు. గత పది రోజులుగా గ్రామాలకు మంచి నీటి సరఫరా నిలిచినా నిర్వహణదారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోటార్లకు యుద్ధప్రాతిదికన మరమ్మతులు చేయించి గ్రామాలకు మంచినీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజల కోరుతున్నారు.



కొత్తపాలెం బీసీ కాలనీ సమీపాన నీరులేని మంచినీటి ట్యాంక్



చోరీ జరిగిన గదిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

# పెదఇర్లపాడులో చోరీ

పీసీపల్లి, డిసెంబరు 8: పెదఇర్లపాడులో లింగాలదిన్నె నరసింహారెడ్డి ఇంట్లో దొంగలుపడి సుమారు రూ.2 లక్షలకు పైగా విలువైన బంగారు, వెండి వస్తువులు అపహరించారు. ఎస్సై జి.కోటయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని రైస్‌మిల్ సమీపంలో నివాసం ఉంటున్న నరసింహారెడ్డి, ఆయన భార్య ఇటీవల హైదరాబాద్ వెళ్లి రెండు రోజుల క్రితం తిరిగి స్వగ్రామానికి వచ్చారు. ఆదివారం ఓ ఫంక్షన్‌కు వెళ్లేందుకు నరసింహారెడ్డి భార్య డెస్క్‌లో నగల కోసం చూడగా కనిపించలేదు. ఆరు జతల కమ్మలు, నల్లపూసల దండ, ఆరు ఉంగరాలు, డాలర్, చిన్నపిల్లల బ్రాస్‌లెట్ మొత్తం 9 సవర్ల బంగారంతో పాటు మూడు జతల వెండి పట్టీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు భావించిన నరసింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. చోరీకి గురైన ఇంటిని కనిగిరి సీఐ ఖాజావలి, ఎస్సై కోటయ్య పరిశీలించారు. క్లూస్‌టీం బృందం చోరీ జరిగిన గదిని పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కోటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గోవులను సంరక్షించాలి

» కనిగిరిలో శునకాల స్వైర విహారం

» పట్టించుకోని అధికారులు

» ప్రజలకు తప్పని పాట్లు



రాత్రి వేళల్లో రోడ్లపై తిరుగుతున్న గోవులు

కనిగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కనిగిరి మున్సిపాలిటీలో ఆవుల సంచారం ఎక్కువైంది. పగటి వేళల్లో రోడ్లపైకి రావటంతో వాహనాలు తగిలి గాయపడుతున్నాయి. గత మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి గోవులను సంరక్షించి అటవీ ప్రాంతంలో వదిలి వేయాలని సూచించారు. లేకుంటే గోవుల యజమానులను గుర్తించి హెచ్చరికలు జారీచేసి వాటిని అప్పగించాలని ఆదేశించారు. అలాగే, శునకాల బెడద తీవ్రంగా ఉంది. వాటిని పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలి ప్రజలకు ఇబ్బందులను తొలగించాలని చెప్పారు. ఎమ్మెల్యే ఆదేశించి నెలరోజులు గడుస్తున్నా ఇంత వరకు మున్సిపల్ అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టలేదు.



స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

పట్టణంలో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. పాదచారులు, వాహనచోదకుల వెంటబడుతుండటంతో గాయాలపాలవుతున్నారు. రోడ్లపై గోవులు తిరుగుతూ వ్యర్థాలను తిని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. కొన్ని గోవులు లంపిస్కిన్ వ్యాధితో బాధపడుతున్నాయి. శరీరంపై ఏర్పడిన బొబ్బల నుంచి రక్తస్రావం అవుతూ దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువైద్యాధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని పామూరు బస్టాండు సెంటరులోని వివిధ పండ్ల దుకాణదారులు చెప్తున్నారు.

ఇప్పటికైనా మున్సిపల్, పశుసంవర్థకశాఖ అధికారులు స్పందించి శునకాల బెడద నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, గోవులను సంరక్షించి వైద్యం చేయించాలని కోరుతున్నారు.

# ప్రమాదకరంగా వావిళ్లవాగు చప్టా

» రక్షణగోడలు లేక వాహనచోదకుల అవస్థలు

» పట్టించుకోని అధికారులు

తాళ్లూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లూరు-తూర్పుగంగవరం ఆర్‌అండ్‌బీ మార్గంలో మాదవరం సమీపంలో గల వావిళ్లవాగు చప్టాపై రక్షణ గోడలులేక ప్రమాదాలు పొంచిఉన్నాయి. చప్టా నిర్మాణ సమయంలో ఇరువైపులా ఏర్పాటుచేసిన రక్షణ గోడలు కొన్నిసంవత్సరాల కిత్రం పడిపోయాయి. నిత్యం ఈమార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.వాహనాలు చప్టాపై ప్రయాణించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రివేళ ప్రయాణ సమయంలో చప్టా మార్జిన్ కన్పించక ప్రమాధాలు జరుతున్నాయి.వర్షాకాలంలో చప్టాపై నీరు ప్రవహించే సమయంలో చప్టా కన్పించక ప్రమాదాలు జరిగి వాహనాలు వాగులో పడిన సంఘటనలు ఉన్నాయి.

చట్టాకు ఇరువైపులా ఏపుగా చెట్లు పెరిగిపోయాయి. రక్షణ గోడలు లేకపోవడంతో అక్కడ చప్టా ఉన్నదని తెలియక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత టీడీపీ పాలనలో మండలంలోని తూర్పుగంగవరం- తాళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మినహా మిగిలిన అన్ని రహదారులను డబుల్ రోడ్లుగా మార్చేందుకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం తాళ్లూరు-తూర్పుగంగవరం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ చప్టాపై పూర్తి స్థాయిలో తారువేశారు. రోడ్డు నిర్మాణాలు చేయించే ఆర్‌అండ్‌బి అధికారులు ప్రమాదకరంగా ఉన్న చట్టా ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రక్షణ గోడలు లేని వావిళ్లవాగు చప్టా





కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌కు బొకే అందజేస్తున్న డాక్టర్ లక్ష్మి దంపతులు

### గ్రామీణ రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

దర్శి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కేంద్ర గ్రామాణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పల్నాడు జిల్లా రాయపాడులో జరిగిన ఓ ఉత్సవంలో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రిని లక్ష్మి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో అనేక ప్రాంతాలకు లింకు రోడ్లు పూర్తి స్థాయిలో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పలు రోడ్ల నిర్మాణానికి, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అందుకు కేంద్రమంత్రి చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.

### పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన యువకుడు

దర్శి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో ఆదివారం ఓ యువకుడు రోడ్డు మార్జిన్‌లో కారును అడ్డంగా పెట్టాడు. దాని తొలగింపు విషయంలో సదరు యువకుడు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. మండలంలోని తూర్పువీరాయపాలెంకు చెందిన వి.సురేష్ పట్టణంలోని అద్దంకి రోడ్డులో కారు నిలిపాడు. ఈక్రమంలో వెనుక నుంచి వాహనాలు ముందుకు వెళ్లే లేక ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడింది. దీంతో పోలీసులు వెళ్లి కారును పక్కకు తీయాలన్నారు. అందుకు ఆ యువకుడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. విషయాన్ని ఎస్ఐ మురళికి తెలపడంతో ఆయన వచ్చి సురేష్‌ను మందలించి కారును పక్కకు తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించినందుకు సురేష్‌పై కేసు నమోదు చేశారు.

### గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి కరుణించమ్మా గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

**మిట్టపాలెంలో..**

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు నారాయణ స్వామి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రలు, పుష్పాలంకరణ చేశారు. స్వామి వారికి మహానైవేద్యం సమర్పించి గోసాలలోని గోవులకు గో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### యువకుడిపై దాడి

పీసీపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని క్రాస్ చేసి వెళ్లారన్న కోపంతో దళిత యువకుడిపై కొంతమంది దాడిచేసి గాయపరిచారు. ఈఘటన శనివారం రాత్రి మండలంలోని చినవరిమడుగులో చోటుచేసుకుంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.కోటయ్య ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. చినవరిమడుగు గ్రామానికి చెందిన కొడవటికంటి ఇమ్మానుయేల్ బేల్దార్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం పీసీపల్లిలో పనులు ముగించుకొని రాత్రి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై తన అన్నకొడుకుతో కలిసి వెళ్తున్నాడు. ఈక్రమంలో మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన పెసల ప్రసాద్, రమణయ్య, మల్లికార్జున్‌లు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని క్రాస్ చేశారు. దీంతో వారు దూషించి దాడిచేశారు. దాడిలో ఇమ్మానుయేల్ పెదవికి రక్తగాయంకాగా, చికిత్స కోసం 108లో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాడు. కనిగిరి పోలీసులు బాధితుడి వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేయగా, పీసీపల్లి ఎస్సై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

కాగా ఇమ్మానుయేల్ రాష్ డ్రైవింగ్ చేస్తూ మాపైకి వచ్చాడని పెసల ప్రసాద్ ఫిర్యాదుచేశాడు. దీనిపై తాము ప్రశ్నించగా ఇమ్మానుయేల్, మరికొంత మంది తమపై దాడిచేశారని పేర్కొన్నారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఇమ్మానుయేల్, అతని అనుచరులపై కూడా పోలీసులు కేసు నమోదుచేశారు.

### డిగ్రీ కళాశాలలో సెమీక్రిస్మస్ వేడుకలు

కనిగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సర్వమతాల మార్గం ఒక్కటేనని తెలియచెప్పేదే క్రిస్మస్ పండుగ అని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఓఎస్‌డీ కేవీఎస్ రాజు అన్నారు. పట్టణంలోని ఏఎల్‌ఎస్‌ఎం మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మతసామరస్యంతో పండుగలను జరుపుకోవాలన్నారు. పేద, ధనిక, కులం, మతం తేడా లేకుండా కలసిమెలసి నడిచేది విద్యాలయాల్లో మాత్రమేనని చెప్పారు. మంచి నడవడికతో విద్యలో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు, గంటా విద్యాసాగర్, టి.రాజా, వై.ఆనోక్ తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలి

ముండ్లమూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల రెవెన్యూలోని గంగన్నపాలెం పేదలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వెల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం గంగన్నపాలెం పేదలతో సర్వే నెంబరు 532లో ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ భూమిలో చెట్లు కొట్టి ఎర్ర జెండాలు పాతి స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు పెత్తందారులు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్న ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు బోడపాటి హనుమంతరావు, కోటయ్య, మహేష్, హనుమయ్య, వెంకటేశ్వర్లు, రామయ్య, మార్క్, చినవెంకటయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ బోల్తాపడి రైతు దుర్మరణం



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

కనిగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండలంలోని గొల్లపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపి మండలం చౌడుపాలెం గ్రామానికి చెందిన దోపూడి కోటేశ్వరరావు (65) సీఎస్‌పురం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో దాదాపు 30ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో పొగాకు మడులు కట్టేందుకు సామగ్రిని ట్రాక్టర్‌లో వేసుకుని స్వగ్రామం నుంచి కనిగిరి మీదుగా ఉప్పలపాడుకు వెళుతున్నాడు. గొల్లపల్లి చెరువు వద్ద ట్రాక్టర్ స్పీడు పెంచి అలుగును ఎక్కించే ప్రయత్నం చేశాడు. దీంతో ట్రాక్టర్‌కు, ట్రాలీకు ఉండే చింతకాయ విరిగిపోయి బోల్తాపడింది. ట్రాక్టర్ కిందపడి కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీరాం ఘటనాస్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చిన్నపాటి వర్షానికే బాపట్లలోని ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ దుస్థితి

- అక్రమాలపై దృష్టి సారించిన ప్రభుత్వం
- పరిశీలనకు సెర్ప్ ప్రత్యేక మొబైల్ యాప్
- పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక సచివాలయం ఎంపిక
- మండలానికి వెలుపల అధికారుల బృందంతో క్షేత్రస్థాయిలో తనిఖీ
- గ్రామాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ
- సోమ, మంగళవారాల్లో తనిఖీ.. 10న ప్రభుత్వానికి నివేదిక





# పింఛన్ల.. పరిశీలన

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పింఛను అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల విషయంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వెలుగు చూసిన అక్రమాలను పరిశీలించి, ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాకో సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని, ఆ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి పింఛనుదారులను స్వయంగా అధికారులు పరిశీలించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 9, 10 తేదీల్లో ఈ తనిఖీలు పూర్తి చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

### సెర్ప్ ఆధ్వర్యంలో పరిశీలన

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో పింఛన్ల పరిశీలన చేపట్టనున్నారు. అందుకోసం సెర్ప్ ఒక మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించింది. తనిఖీ చేసే అధికారుల బృందాన్ని సెర్ప్ నిర్ణయిస్తుంది. ఏ మండల పరిధిలో ఏ సచివాలయంలో తనిఖీలు జరుగుతాయో ఆ సచివాలయ పరిధిలోని ఉద్యోగులను ఈ బృందంలో సభ్యులుగా నియమించరు. ఆ మండలానికి వెలుపల ఉండే ఉద్యోగులతోనే బృందాన్ని ఏర్పాటు చేస్తారు. ఒక్కో బృందం 40 మంది పింఛనుదారుల వివరాలను పరిశీలించాలి. బృందాలు పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలను సెర్ప్ రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ అధికారులుగా ఉంటారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కూడా నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుంది. నివేదికను ఈ నెల 10న ప్రభుత్వానికి అందజేస్తారు. ఈ పరిశీలనలో అనర్హులుగా గుర్తించిన వారికి జనవరి నుంచి పింఛను రాదు. తొలగించిన ప్రతి ఒక్క పింఛనుదారుడికి వారి పింఛను తొలగింపునకు సంబంధించిన కారణాన్ని తెలుపుతూ వారికి ఒక అక్నాలెడ్జ్‌మెంటు లెటర్ వస్తుంది. ఆ లెటర్ అందుకున్న వారిలో అర్హులు ఉంటే వారు సంబంధిత సచివాలయంలో అర్హతా పత్రాలు సమర్పిస్తే, అధికారులు వాటిని పరిశీలించి పింఛన్‌ను పునరుద్ధరించే అవకాశం ఉంది.

### వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా..

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా పింఛన్లు మంజూరు చేశారు. నిజమైన అర్హులను అనర్హులుగా పేర్కొని, వారిని తొలగించి, అనర్హులను పింఛనుదారులగా నమోదు చేసి వారికి పింఛన్లు అందజేశారు. ప్రధానంగా దివ్యాంగ పింఛన్ల విషయంలో ఈ అక్రమాలు అంతులేకుండా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇష్టమొచ్చినట్లుగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడంతో అర్హులకు అందాల్సిన పింఛన్లను వైసీపీ అనుయాయులు కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అక్రమాలన్నీ వెలుగులోకి వచ్చాయి. పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో స్వయంగా స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులను చూసి ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. అనేకమంది అనర్హులు పింఛన్లు తీసుకోవడం గమనించిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి ఈ విషయాన్ని నివేదించారు. ఈ క్రమంలో తాజాగా పింఛన్ల పరిశీలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక గ్రామ/వార్డు సచివాలయంలో తనిఖీలు నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లాలో చేబ్రోలు మండలం వేజెండ్లలోని సచివాలయ పరిధిలోని పింఛనుదారుల వివరాలను పరిశీలించనున్నారు.

### కొత్త పింఛన్లు ఎప్పుడు?

పాత పింఛన్ల తనిఖీల మాటెలా ఉన్నా జిల్లాలో కొత్త పింఛన్ల మంజూరు కోసం ఎదురు చూసే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతూ ఉంది. దానికి తోడు కొత్త పింఛన్లు, రేషన్‌కార్డుల ప్రక్రియకు సంబంధించి అనేక వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఈ నెల 15 నుంచి కొత్త పింఛన్ల దరఖాస్తు ప్రక్రియ మొదలవుతుందన్న ఊహాగానాలు వస్తున్నాయి. ఈ నెల 15న ప్రక్రియను ప్రారంభించి వచ్చే నెల సంక్రాంతి నుంచి పింఛన్లు అందజేస్తారన్న వార్తలు వినిపిస్తుండడంతో లబ్ధిదారుల్లో హడావుడి పెరిగింది.

కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని గత వైసీపీ పాలకులు ప్రకటనలతో సరిపెట్టారు. పదుల ఎకరాల్లో వందల్లో లేఅవుట్లు వేసి వేలల్లో ఇళ్లు మంజూరు చేయగా అరకొరగానే ఇళ్లు పూర్తి అయ్యాయి. మొండిగోడలు, పిచ్చిమొక్కలతో జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. పేరుగొప్ప ఊరుదిబ్బ అనుచందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. చాలావరకు ఇళ్లు పునాదుల దశకే పరిమితమయ్యాయి. కాలనీలకు రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ, తాగునీరు తదితర కనీస సౌకర్యాలు కల్పన చేయకుండా.. వాటికి సంబంధించి ఆలోచన చేయకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలంటూ లబ్ధిదారులను పరుగులు పెట్టించింది. దీంతో కొందరు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకోగా కనీస మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో నివాసానికి లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. నాటి పాలకులు కాలనీలు కాదు ఊళ్లు అని ప్రకటించగా.. ఐదేళ్లకు అవి చిట్టడవులు, బురదగుంతలను తలపించేలా మారాయి. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టిన వెంటనే కాలనీల్లోని పేదల ఇళ్లపై దృష్టి సారించింది. ఇళ్ల నిర్మాణాలకు లక్ష్యాలు నిర్దేశించింది. దీంతో కొన్నిప్రాంతాల్లో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.



పాలం కాదు.. జగనన్న కాలనీ

రేపల్లె : పెద్దఅరవపల్లిలో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న జగనన్నకాలనీ స్థలం

# కాలనీలు.. పునాదుల్లోనే

ఆంధ్రజ్యోతి ఫోకస్

- పేరుగొప్ప ఊరుదిబ్బగా జగనన్న కాలనీలు
- మౌలిక వసతుల కల్పనలో గత పాలకుల అలసత్వం
- ఈ నెలాఖరుకు ఇళ్లు పూర్తికి కూటమి ప్రభుత్వం లక్ష్యం
- సొంతంగా నిర్మించుకున్నా నివాసయోగ్యంగా లేని వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కాలనీ ప్రాంగణాలు
- కాలనీల పేరుతో హడావుడికే పరిమితమైన గత ప్రభుత్వం

(బాపట్ల, న్యూస్‌నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

పేరు గొప్ప ఊరుదిబ్బగా జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు పేరుతో కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. అయితే నాలుగేళ్ల పాటు హడావుడికే పరిమితం కాగా ప్రస్తుతం పలు కాలనీల్లో ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయి. కొన్ని దగ్గర ఇళ్లు మొండిగోడలతో కనిపిస్తున్నాయి. ఊర్లకు దూరంగా కాలనీలు ఏర్పాటు చేసింది. పైగా ప్రభుత్వం తొలుత ప్రకటించినట్లు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా ఆ భారం లబ్ధిదారులపైనే వేయడంతో ఊర్లకు దూరంగా ఉన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. పేదలందరికీ స్థలాలు ఇచ్చి, వారికి ఇళ్లు నిర్మించి ఇస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాట ఆచరణలో నీటి మూటగానే మిగిలిపోయింది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుందని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మాణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవసరమైన

(మిగతా 6వ పేజీలో..)

### ప్రభుత్వ సహకారం..

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం ప్రారంభించి ఆర్థిక ఇక్కట్లతో అర్థంతరంగా ఆపేసిన వారికి సహకారం అందించి ఇళ్లు పూర్తి చేసేలా చూడాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశాలను సైతం కూటమి ప్రభుత్వం ఇచ్చింది. గత ప్రభుత్వంలో లేఅవుట్లలో ప్లాట్ పొంది ఇంటి నిర్మాణం ప్రారంభించని వారి విషయంలో ప్రభుత్వం అంతర్గతంగా విచారణ జరుపుతుంది. ఇక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులకు సంబంధించి అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ నిధులపై ఇప్పటికే కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చింది. త్వరలోనే వీటిని మంజూరు చేసి ఆయా కాలనీలను నివాసయోగ్యంగా మార్చేందుకు సిద్ధమైంది.

గుంటూరు : పునాదులు, గోడల దశలో ఆగిపోయిన పేదల ఇళ్లు




### బాపట్ల జిల్లాలో 12,000 ఇళ్లే పూర్తి

బాపట్ల జిల్లాలో జగనన్న కాలనీల పేరిట 278 లేఅవుట్లను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం దాదాపు 78,000 మందికి సొంతింటి కల నెరవేరుస్తామని బీరాలు పలికింది. ఐదేళ్లలో అంతా కలిపి పూర్తి చేసింది 12,000 మాత్రమే. 40,000 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా 26,000 వరకు అసలు ప్రారంభించలేదు. 12,000 ఇళ్లు పూర్తి చేయడానికి కూడా దాదాపు మూడేళ్ల సమయాన్ని గత ప్రభుత్వం తీసుకుంది. 278 లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు కేవలం రూ.45 లక్షలే ఖర్చు పెట్టినట్లు సమాచారం. అనేక వ్యయప్రయాసల కోర్చి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి అక్కడ మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టిపెట్టకపోవడంతో మళ్లీ అద్దె ఇళ్లే దిక్కయ్యాయి. ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం అప్పగించింది. వీటిలో పలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఓ కాంట్రాక్టర్‌కు దాదాపు 60 ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించగా కేవలం 20 ఇళ్లకు మాత్రమే పునాదులు వేసి దాదాపు రూ.90 లక్షల వరకు బిల్లులు చేయించుకున్నాడు. చీరాల నియోజకవర్గ పరిధిలో జగన్ కాలనీల్లో సింహభాగం మనుషులు లేని గూళ్లు దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో మొత్తం 12 లేఅవుట్లల్లో 1533 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అందులో 971 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కానీ వాటిలో గృహప్రవేశాలు చేసిన వారి సంఖ్య సగానికి సగం కూడా లేవు. అద్దంకి పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డు, నాగులపాడు రోడ్డు, బొమ్మనంపాడు రోడ్లలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి సుమారు 1800 మంది లబ్ధిదారులకు స్థలాలను పంపిణీ చేశారు. మూడో వంతు మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నారు. రెండేళ్ల నుంచి నివాసం ఉంటున్నా కనీస వసతులైన రోడ్లు, మంచినీటి వసతి, డ్రెయినేజీ సౌకర్యాలు లేవు. రేపల్లె నియోజకవర్గంలో జగనన్నకాలనీల కోసం ఇచ్చిన స్థలాలన్నీ లోతట్టు ప్రాంతం కావటంతో మోకాలు లోతు నీరు నిలిచి పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. 80శాతం ఎక్కడా కూడా గృహాలు నిర్మించిన దాఖలాలు లేవు. మార్టూరు మండలం నాగరాజుపల్లిలో 40 జగనన్న ఇళ్లు మంజూరు కాగా ఒకే ఒక్కరు ఇంటిని నిర్మించుకున్నారు. మరో ఆరుగురు ఇంటి నిర్మాణాలు చేయకుంటే రద్దు అవుతుందన్న భయంతో బేస్‌మెంట్‌లు వేశారు.



మార్టూరు : నాగరాజుపల్లిలో జగనన్నకాలనీలో నిర్మించిన ఒకే ఇల్లు



రేపల్లె : 18వ వార్డు జగనన్న కాలనీలో బురదమయంగా రహదారి



పాత చీరాల లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న గృహాల దుస్థితి

### క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు

- అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని లేకుంటే ఏది చేసిన వ్యర్థమేనని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. పట్టణంలోని విజయలక్ష్మీపురంలో గల రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం 2కె, 5కె రన్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని చెప్పారు. రామకృష్ణ పరమహంస, శారదాదేవి, స్వామి వివేకానందలు చెప్పిన విధంగా ప్రతి ఒక్కరు నిద్ర లేవగానే తల్లిదండ్రులకు నమస్కరించాలని చెప్పారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్‌లు, మెమోంటోలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చిరంజీవి, నటరాజన్, సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

### సమాచారం రెగ్యులర్‌గా అప్‌డేట్ చేయాలి

- డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి

బాపట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఐహెచ్ఐపీ సమాచారం పోర్టల్‌లో రెగ్యులర్‌గా అప్‌డేట్ చేయాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ కె.పద్మావతి తెలిపారు. బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమర్జన్సీ అకడమిక్ టీమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల కనీసం రెండు మూడు డెలివరీలు నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓపీ సంఖ్య పెంచాలన్నారు. కార్యక్ర మంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఐవో వెంకటేశ్వర్లు, డీపీఎంవో డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ సౌజన్య, ఇతర వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అతివేగంతో.. అనంతలోకాలకు

పిడుగురాళ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అతి వేగం.. నలుగురిని బలితీసుకోగా, మరో నలుగురుని తీవ్రంగా గాయపరిచింది. వంద కిలోమీటర్లకు పైగా వేగంతో వస్తున్న కారు అదుపుతప్పి.. హైవేపై ఉన్న హెచ్చరిక బోర్డును ఢీకొట్టి.. ఆ తర్వాత చెట్టును ఢీకొట్టింది. నేరుగా చెట్టును ఢీకొట్టి ఉంటే ప్రమాద తీవ్రత మరింత పెరిగేదని పోలీసులు గుర్తించారు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా చెట్టు నుంచి కారును ఎక్స్‌కవేటర్ సాయంతో పక్కకు తొలగించాల్సి వచ్చింది. ఈ ప్రమాదానికి సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు.. నెల్లూరు జిల్లా కావలి రూరల్ పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన ఉప్పాళ్ల ప్రణయ్‌కుమార్ ఇటీవల కొత్తగా కారు కొనుగోలు చేశారు. అదే గ్రామానికి చెందిన తుళ్లూరి సురేష్(35), ఉప్పాళ్ల యోబులు(65), కావలికి చెందిన తాతా పెద్దతిరుపతి(60) ఆంజనేయస్వామి మాల ధరించారు. ఈ క్రమంలో కొత్త కారుకు పూజలు చేయించుకోవాలని ప్రణయ్‌కుమార్ తెలంగాణలోని కొండగట్టు అంజనేయస్వామి ఆలయానికి బయల్దేరారు. దీంతో ఆయన కారులో మాలదారులతో పాటు కుటుంబసభ్యులు, బంధువులైన సురేష్ భార్య తుళ్లూరి వనిత(32), ఉప్పాళ్ల ఆదిలక్ష్మి, ఉప్పాళ్ల శ్రీను, ఉప్పాళ్ల తాతా కౌసల్యలు కూడా వెళ్లారు. వీరంతా శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో ఇరుముడులు చెల్లించుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. తిరిగి వస్తూ శనివారం రాత్రి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం సమీపంలోని ఓ పెట్రోలు బంకు వద్ద అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 4 గంటల వరకు విశ్రాంతి తీసుకుని తిరిగి బయలుదేరారు. 5.30 గంటల సమయంలో అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర హైవేపై పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని గీతిక పాఠశాల వద్ద ఉన్న మలుపులోని హెచ్చరిక బోర్డును తొలుత ఢీకొట్టి ఆ తర్వాత ఆ పక్కనే ఉన్న చెట్టును కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో కారులోని నలుగురు మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దతిరుపతి మృతి చెందగా ఆయన భార్య కౌసల్య తీవ్రంగా గాయపడ్డారు. సురేష్, ఆయన భార్య వనిత, మేనమామ ఉప్పాళ్ల యోబులు మృతి చెందగా యోబులు భార్య ఆదిలక్ష్మి, ప్రణయ్‌కుమార్, ఉప్పాళ్ల శ్రీనులకు తీవ్రగాయాలయ్యాయి. సురేష్ ప్రతి ఏడాది ఆంజనేయస్వామి మాలధరించి తిరుమల సమీపంలోని జపాలికి వెళ్తుండేవాడు. ఈసారి కొండగట్టుకు వెళ్లాలని నిర్ణయించుకుని కారులో వెళ్లి వస్తూ మృతి చెందాడు. సురేష్ విద్యుత్ కాంట్రాక్ట్ పనులు చేయిస్తుండగా, ఆయన భార్య వనిత కుట్టుమిషన్‌తో జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దతిరుపతి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

### ఘటనాస్థలిని పరిశీలించిన ఎస్పీ

ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు, గురజాల డిఎస్పీ జగదీష్, ఆర్టీవో మురళీకృష్ణ, సీఐ వెంకట్రావు, సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిని పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదం గురించి బంధువులకు సమాచారం ఇవ్వగా వారు ఆస్పత్రి వద్దకు తరలివచ్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబసభ్యులు ఒంగోలు, నెల్లూరుకు క్షతగాత్రులను తీసుకెళ్లారు. జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవ్‌కుమార్, పిడుగురాళ్ల రవాణాశాఖ అధికారి రాంబాబులు చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. రెండు రోజులు వరుసగా ఒకరే కారు డ్రైవింగ్ చేయడం, విశ్రాంతి లేకపోవడంతో నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఎస్పీ తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పోలీసు, వైద్యాధికారులు, మృతుల బంధువులతో ఫోన్‌లో మాట్లాడారు.

- బ్రాహ్మణపల్లి సమీపంలో అదుపుతప్పిన కారు
- నలుగురు మృతి.. మరో నలుగురికి తీవ్రగాయాలు
- కొండగుట్టలో మొక్కు చెల్లించి వస్తుండగా ఘటన
- మృతులది కావలి సమీపంలోని సిరిపురం గ్రామం



మలుపువద్ద కారు ఢీకొట్టగా పడిపోయిన హెచ్చరిక బోర్డును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



సంఘటనలో మృతిచెందిన వారు (సర్కిల్‌లో) మొదటి ఫొటో ఉప్పాళ్ల యోబులు, రెండో ఫొటో తాతా పెద్ద తిరుపతి, మూడో ఫొటో తుళ్లూరి సురేష్, వనిత దంపతులు (ఫైల్)

# నేటితో గడువు ముగింపు

- పట్టభద్రుల ఓటుకు వేలల్లో దరఖాస్తులు
- ఇప్పటికే 2,90,978 మందికి ఓటు హక్కు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు/అభ్యంతరాల దాఖలుకు సోమవారం సాయంత్రంతో గడువు ముగియనుంది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం కూడా వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. గత నెల 23న డ్రాఫ్టు ఓటరు లిస్టుని ప్రచురించిన తర్వాత ఈ నెల 9 వరకు క్లెయిమ్‌లు/అభ్యంతరాల దాఖలుకు ఎన్నికల సంఘం గడువు ఇవ్వడంతో ఇంకా ఓటరుగా నమోదు కాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం మరో 60 వేలకు పైగా కొత్త దరఖాస్తులు ఆరు జిల్లాల నుంచి రావడం విశేషం. ఇంకా మరికొన్ని గంటల గడువు సమయం మాత్రమే ఉండటంతో ఈ సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉన్నది. ఎవరైతే 2021 నవంబరు 1వ తేదీ నాటికి డిగ్రీ పట్టాని పొంది ఉంటారో వారందరికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే 2 లక్షల 90 వేల 978 మంది పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీలు సమీపిస్తున్న దృష్ట్యా క్లెయిమ్‌ల సందర్భంగా వస్తోన్న దరఖాస్తులను మరుసటి రోజే పరిశీలన జరిపించి పరిష్కరిస్తున్నారు.

# అతివేగం..నిర్లక్ష్యం వల్లే ఘోరాలు

- మృత్యు శకటాలుగా టిప్పర్లు
- వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డులో తరచూ ఘటనలు
- ఒకే రోజు వేర్వేరుచోట్ల ప్రమాదాల్లో నలుగురు మృతి
- మూడు గ్రామాల్లో విషాదం

పర్చూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు - పిడుగురాళ్ల రహదారి పనుల కోసం వినియోగిస్తున్న టిప్పర్ లారీలు ప్రజలబారిన మృత్యు శకటాలుగా మారుతున్నాయి. ఈ మార్గంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. డ్రైవర్లు నిర్లక్ష్యంగా టిప్పర్లను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం సమీపంలో బైక్‌పై వస్తున్న ముగ్గురిని టిప్పర్ లారీ వెనుక నుంచి అతివేగంగా ఢీకొనడంతో అత్త, అల్లుడు అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌పై ఉన్న కుమార్తె వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే రోడ్డులో మరో టిప్పర్ ఉప్పుటూరు వద్ద సైకిల్ నడిపించుకొని వస్తున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగిపై నుంచి దూసుకెళ్లింది. మండలంలోని నాగులపాలెం గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి తూమాటి సుబ్బయ్య (74) సైకిల్‌ను నడిపించుకుంటూ వస్తుండగా టిప్పర్ ఢీకొట్టింది. అలాగే తిమ్మరాజుపాలెం సమీపంలో మరో రోడ్డు ప్రమాదంలో దగ్గుబాడు గ్రామానికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయాలపాలయ్యారు. ప్రస్తుతం అతను పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో రోడ్డు ప్రమాదాలు ఈ ప్రాంతంలో అనేకం జరుగుతున్నాయి. ప్రధానంగా ఈ రోడ్డు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందుకోసం పెద్ద సంఖ్యలో టిప్పర్లు రోజూ తిరుగుతున్నాయి. భద్రతా చర్యలు చేపట్టకపోవడంతోపాటు టిప్పర్ డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా తరచూ ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రోడ్డు నిర్మాణం ప్రారంభంలోనే**


టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన అత్త, అల్లుడు

రోడ్డు నిర్మాణం ప్రారంభంలో ఇదే రోడ్డులో ఈపూరువారిపాలెం వద్ద ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టక పోవటం, సక్రమంగా డైవర్షన్ ఏర్పాటు చేయకపోవడంతో గత మేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీకొని నలుగుదు సజీవదహనం అయ్యారు.

**నామమాత్రంగా ప్రమాద హెచ్చరికలు**

రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి భద్రతా చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. ఈ కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో పరిస్థితి దయనీయంగా ఉంటోంది. సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు దీనిపై దృష్టి సారించి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**బోరుమంటున్న కుటుంబాలు**

మేదరమెట్ల : రోడ్డు ప్రమాదాల వలన పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తప్పు ఎవరిదైనా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలలో పోషించేవారు లేక వృద్ధ తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మేదరమెట్లకు చెందిన షేక్ మస్తాన్‌వలి, భార్య అమీరూన్ దంపతులతో పాటు మస్తాన్‌వలి మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన అత్త బుడెమ్మ ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఈ రెండు కుటుంబాలు బోరుమంటున్నాయి. మస్తాన్‌వలి తండ్రి షేక్ మాబు తల్లి జమీలాకు ముగ్గురు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు మస్తాన్ వలి ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రెండో కుమారుడు సుభానీ నాలుగేళ్ల కిందట త్రోవగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇద్దరు కుమారులను రోడ్డు ప్రమాదంలో కోల్పోయిన తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది. దీనికి తోడు మాబు పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్నారు. మస్తాన్‌వలి అత్త బుడెమ్మ ప్రమాదంలో మృతి చెందడంతో రెండు కుటుంబాలలో విషాదం నెలకొంది. మస్తాన్‌వలి కొన్ని సంవత్సరాలుగా బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నారు. మాబు చిన్నకుమారుడు సెంట్రింగ్ పనిలో కూలీగా వెళుతున్నాడు. ఈ రోడ్డు ప్రమాదంతో ఇటు మేదరమెట్ల, అటు కోనంకిలో విషాదఛాయలు అలముకున్నాయి.


సుబ్బయ్య (ఫైల్)

**కోనంకి సమతానగర్‌లో విషాదం**

మార్టూరు : రోడ్డు ప్రమాదంలో భార్య, కుమార్తె, అల్లుడు ప్రాణాలు కోల్పోగా షేక్ ఇమాంసాహెబ్ అనే వ్యక్తి కన్నీరు మున్నీరుగా విలపిస్తునానరు. దీంతో మండలంలోని కోనంకి సమతానగర్‌లో బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు. ఇమాంసాహెబ్ భార్య బుడెమ్మ, కూతురు అమీరూన్, అల్లుడు మస్తానవలి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కోనంకి సమతానగర్‌లోని మసీదులో ఇమాం సాహెబ్ నమాజ్ చేస్తుంటారు. అతని భార్య బుడెమ్మ, కూతురు అమీరున్, అల్లుడు మస్తాన్‌వలి, బావమర్ది వలి కలిసి రెండు ద్విచక్రవాహనాల్లో చీరాల బీచ్‌కు వెళ్లి తిరిగి కోనంకి వస్తుండగా టిప్పర్ ఢీకొని బుడెమ్మ, కుమార్తె అమీరున్, ఆమె భర్త మస్తాన్‌వలి మృతి చెందారు.

---


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం

చినగంజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జీడిచెట్లపాలెం గ్రామంలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం మండల పార్టీ ఆధ్వర్యంలో నాయకులు నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ఫూర్తితో పర్చూరుకు చెందిన జనసేన నాయకులు మన్నెం శ్రీకాంత్ ప్రతి ఆదివారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు తెలిపారు. జీడిచెట్లపాలెం గ్రామంలో 13వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రోగ్రామ్స్ కమిటీ కార్యదర్శి తుమ్మలపెంట సతీష్, పర్వతరెడ్డి నాగు, గోపీనాథ్, వెంకటేష్, రంగారావు, గోపి, రాజేష్, వంశీ, జి.గోపి, నారాయణ, బన్నీ, శ్రీహరి, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలందరినీ చల్లగా కాపాడయ్యా

**ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య దంపతులు**

చీరాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరినీ చల్లగా కపాడు కృష్ణా అంటూ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బాలకొండమ్మ దంపతులు శ్రీకృష్ణ భగవాన్‌ను కోరారు. యాదవపాలెం శివాలయం సమీపంలోని శ్రీ మురళీగోపాలకృష్ణ మందిరం 14వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొండయ్య దంపతులు పాల్గొన్నారు. పూజల అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. అంతకు ముందు ఎమ్మెల్యే కొండయ్య కొత్తపేట పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఆ సందర్భంగా పలువురు తమ సమస్యల పరిష్కారం, ఉమ్మడి అవసరాలు తదితరాలకు సంబంధించి ఎమ్మెల్యే కొండయ్యకు అర్జీలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## పరస్పర దాడుల్లో ఇద్దరికి గాయాలు

- బోయినవారిపాలెంలో ఘటన
- రెండు వర్గాలపై కేసు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మేకలకు గడ్డి మేపుకనే సమయంలో నెలకొన్న వివాదం పాత కక్షలు ఉండడంతో విషయం చిలికిచిలికి గాలి వానలా మారింది. దీంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని బోయినవారి పాలెంకు చెందిన వెంకటరావు, గోపీ ఒకే గ్రామస్థులు వీరికి గతంలోనూ వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలోనే శనివారం గ్రామ శివారులోని పొలాల్లో మేకలకు గడ్డి మేపుకునే సమయంలో ఇద్దరు వాదనలు పడ్డారు. దీంతో ఇళ్లకు చేరాక వెంకటరావు కొందరి సహాయంతో గోపి ఇంటికి వెళ్లి గొడ్డలితో దాడి చేయగా గోపీ ఎడమ కాలికు తీవ్ర గాయమైంది. గోపీ మరి కొందరి సహాయంతో కర్రలతో వెంకటరావుపై దాడికి పాల్పడగా అతడి తలకు గాయమైంది. వీరిద్దరూ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందగా, ఈపూరుపాలెం పోలీసులు ఆదివారం రెండు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానంగా తిరుగుతున్న వ్యక్తి అరెస్టు

అద్దంకి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి అనుమానంగా తిరుగుతూ పోలీస్ వాహనాన్ని చూసి దాక్కున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ సయ్యద్ తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి పోలీస్ గస్తీలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్లగా అక్కడ ఓ వ్యక్తి పోలీస్ జీపు చూసి దాక్కున్నాడు. గమనించిన పోలీసులు అతనిని పట్టుకొని విచారించారు. సరైన సమాధానం చెప్పలేదు. మద్దిపాడు మండలం గడియాపూడి కాలనీ బొమ్మల నరేష్‌గా గుర్తించినట్లు ఆయన తెలిపారు.

## క్రీస్తు మార్గంలో పయనించాలి

చినగంజాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : క్రీసు ప్రేమ, దయ, గుణాలు అందరికీ మార్గదర్శకమని క్రిస్మస్ క్యారల్స్ నిర్వాహకుడు మేకల మేషక్‌బాబు అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా స్థానిక అంబేడ్కర్‌నగర్ గ్రామ పెద్దలు, అంబేడ్కర్ ఉద్యోగుల సంఘం సభ్యులు, యువజన సంఘం సభ్యుల సహకారంతో ఆదివారం వేకువజామున సండే స్కూల్ చిన్నారులు గ్రామంలో క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యారెల్స్ కార్యక్రమానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మేషక్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు, యువతీ యువకులకు పాటలు, క్విజ్, బైబిల్ వాక్యలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించి, పోటీలలో విజేతలైన వారికి క్రిస్మస్ పండుగ రోజు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సండే స్కూల్ చిన్నారులు, యువతీ యువకులు పాల్గొన్నారు.


క్రిస్మస్ క్యారల్స్ ప్రదర్శిస్తున్న చిన్నారులు

## కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు టీడీపీలో చేరిక

**కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కొండయ్య**

కొత్తపేట(చీరాల), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన దర్శి నాగేంద్రమణి, చైతన్య, గుండాల సువార్తమ్మకు ఎమ్మెల్యే కొండయ్య టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమన్వయంతో పనిచేయాలని అందరికీ సముచిత ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు డేటా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు

**అంగన్‌వాడీ సహాయకులకు నియామకపత్రాలు**

నూతనంగా అంగన్‌వాడీ సహాయకులుగా నియమితులైన వారికి ఎమ్మెల్యే కొండయ్య ఆదివారం పార్టీ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా, చిత్తశుద్ధితో పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వేటపాలెం, సంతరావూరు మధ్య మూసివేసిన రైల్వే గేటు

## రైల్వే గేటు మూసివేత

వేటపాలెం, చీరాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం, సంతరావూరు మధ్య ఉన్న రైల్వే గేటును మరమ్మతు నిమిత్తం ఆదివారం మూసివేశారు. మరమ్మతు పూర్తయ్యాక ఈ నెల 11వ తేదీ నుంచి రాకపోకలను పునరుద్ధరిస్తారని రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు, వాహనచోదకులు అవాంతరాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## రైతు ఫిర్యాదు

యద్దనపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శనగలును అమ్మగా కొనుగోలు చేసిన వ్యక్తి రూ.21లక్షల డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని యద్దనపూడి గ్రామానికి చెందిన రైతు గొట్టిపాటి వెంకటరావు ఆదివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీశ్రీనివాస కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న 320 క్వింటాళ్ల శనగలను వెంకటరావు అక్టోబరులో చిలకలూరిపేటలోని గోగుల నాగరాజుకు అమ్మారు. ఆ డబ్బులను ఇవ్వడం లేదని వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రత్నకుమారి తెలిపారు.


హెచ్ఎం శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో

## కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు

అద్దంకిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పని చేసే ఉపాధ్యాయులకు, వృత్తి పరంగా విధులను నిర్వహించే వారిని ప్రభుత్వం, సాటి ఉపాధ్యాయలు, విద్యార్థుల నుంచి గౌరవం ఉంటుందని ఎంఈవో బీ సుధాకరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఇటీవల రాష్ట్ర ఉత్తమ ప్రాధానోపాధ్యాయులు అవార్డు పొందిన చక్రాయపాలెం జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేవీ శ్రీనివాసరావును నేస్తం మిత్ర మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేవీ శ్రీనివాసరావు ఉపాధ్యాయుడుగా చేరి ఉద్యోగోన్నతులు పొందుతూ హెచ్ఎంగా మన్ననలు పొందుత్ను విషయాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కెవి శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో హోమియో వైద్యులు కావూరి రఘుచందు, తిమ్మాయపాలెం హెచ్ఎం రామకృష్ణ, ప్రతాప్‌తో పాటు నేస్తం గ్రూప్ ఉపాధ్యాయులు సోమేపల్లి హనుమంతరావు, చప్పిడి కేశవరావు, రామసుబ్బారావు, హెచ్‌యం పోకూరి అంజలి పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

అద్దంకిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యం లో ఆదివారం స్థానిక గీతామందిర్‌లో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, 8 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం జరిగింది. గత నెల 16వ తేదీ నుంచి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎంతో మందికి దాహార్తినీ తీరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి, క్లబ్ రిజయన్ చైర్మన్ సాతులూరి చంద్రకళ పాల్గొని బాధితులకు వాటిని అందజే శారు. దాతలు, క్లబ్ సభ్యులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ వీవీ ఆదినారాయణ, సెక్రటరీ గొల్ల పాపారావు, చిన్ని మురళికృష్ణ, తమ్మన శ్రీనివాసరావు, సునీల్, వనిత క్లబ్ ప్రెసిడెంట్ వి. విజయలక్ష్మి, సెక్రటరీ అంజలి, ట్రెజరర్ కె. నాగలక్ష్మి, వాసవీ, వనితా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు ట్రై సైకిల్స్‌ను అందజేస్తున్న క్లబ్ సభ్యులు

## కాలనీలు.. పునాదుల్లో

(5వ పేజీ తరువాయి)

మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు. ఆర్భాటంగా స్థలాలిచ్చి అధికారులకు లక్ష్యాలు పెట్టి లబ్ధిదారులపై ఒత్తిళ్లు తెచ్చినా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగాయి. దీంతో అత్యధిక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు అరకొరగానే జరిగాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వీలైనన్ని ఎక్కువ ఇళ్లు పూర్తి చేయించి ఫిబ్రవరిలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని గత ప్రభుత్వం నిర్ణయించినా లబ్ధిదారుల నుంచి స్పందన రాలేదు. స్థలాలు పోతాయోమోనని కొందరు లబ్ధిదారులు పునాదులు వేసుకుని వదిలివేశారు. మరికొందరు కనాకష్టంగా ఇల్లు కట్టుకుంటే రవాణా, ఇతర సౌకర్యాలు కల్పించలేదు. కాలనీలకు మౌలిక వసతుల కల్పన గాలికొదిలేశారు. ఇళ్ల నిర్మాణం అంశంలో వైసీపీ ప్రభుత్వం చెప్పన గొప్పలు ఆచరణలో కనిపించలేదు. కొన్ని నెళ్లలుగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది.

**సౌకర్యాలు నాస్తి**

ఆయా కాలనీల్లో పూర్తయిన ఇళ్ళల్లో నివా సం ఉండలేని పరిస్థితులు నెలకున్నాయి. మౌలిక వసతుల కల్పన జరగకపోవడం, ఊరికి దూరంగా ఇళ్లు ఉండటం, రహదారులు, రవాణా సౌకర్యాలు, తాగునీరు అందుబాటులో లేకపోవడం తదతర కారణాలతో ఇళ్లల్లో నివాసం ఉండలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పూర్తయిన గృహాలకు కనీసం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రధాన రహదారుల నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాలనీలల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు నిర్మించే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వర్షం కురిస్తే రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనకు కూడా నిధుల కొరత వెంటాడుతోంది. ఇంటి నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులు నివాసం ఉం డేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. అద్దె గృహాల్లోని నేటికి కాలం గడుతున్నారు.

**ప్రచారం.. ప్రహసనం**

పేదలకు సొంతింటి కాల సాకారం పేరుతో జగనన్న కాలనీలను నిర్మిస్తున్నామని గత ప్రభుత్వం చేసిన ప్రచారార్భాటం అంతా ఇంతా కాదు. జగనన్న కాలనీల పేరిట నడచిన ప్రహసనం పేదలకు ఎన్నో సమస్యలను తెచ్చిపెట్టింది తప్పితే ఇళ్లు పూర్తి అయిన దాఖలాలు అరకొరే. తొలుత జగనన్న లే అవుట్లకు భూమి కొనుగోళ్లతో ప్రారంభమైన దందా తర్వాత లబ్ధిదారుల ఎంపిక, ప్రభుత్వం అందించే అరకొరసాయంతోనే నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులపై ఒత్తిళ్లు, ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే కాంట్రాక్టుల విషయంలో లొసుగులు, ఇళ్లు కట్టుకోకపోతే స్థలాన్ని తీసేసుకుంటామనే బెదిరింపులు ఇలా ఒకటేమిటి జగనన్న ఇళ్ల పేరిట ఎంతోమంది నిరుపేదలు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పోసొప్పో చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసినవారికి అక్కడ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా గత ప్రభుత్వం పూర్తిగా విఫలమవడంతో జగనన్న కాలనీల వల్ల పేదలకు ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నాగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట జరిగిన దోపిడీపై విచారణ జరిపించడమే కాకుండా ఇప్పటికే ఇళ్లు పూర్తి చేసుకున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


విజేతలతో నిర్వాహకులు

## షటిల్ టోర్నీ విజేతలకు బహుమతులు

అద్దంకి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో గత రెండు రోజుల నుంచి చదలవాడ మోహన్‌రావు, శ్రీధరకుమారి జ్ఞాపకార్థం వారి కుమారుడు చదలవాడ ఫణీంద్రబాబు ఆధ్వర్యంలో ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయిలో జరిగిన షటిల్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పలు ప్రాంతాల నుంచి వంద జట్లు పోటీలలో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని ధీరజ్‌ధనుష్ నరసరావుపేట, రెండో బహుమతిని రమేష్ రెహమాన్ పొదిలి, మూడో బహుమతిని మున్నీర్ జితేంద్ర రేపల్లె, నాలుగోవ బహుమతిని బాషా శ్రీను, ఐదో బహుమతిని రాము కోటి అద్దంకి గెలుచుకోగా విజేతలకు నిర్వాహకులు డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు, చుండూరి మురళి, చిన్ని మురళి, చప్పిడి వీరయ్య, నందిరెడ్డి శ్రీనివాసరావు, ప్రసన్నాంజనేయులు, లహరి, గట్టుపల్లి రామారావు, మదీనా, అల్లాబాషా, రాజశేఖర్‌స్వామి మెదలగు వారు పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

## 30 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

బల్లికురవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు అయిదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డులు ఇచ్చేందుకు అన్ని గ్రామాలలో ఈ నెల 30వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియెగం చేసుకోవాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి పేర్కొన్నారు. గ్రామాలవారీగా మొబైల్ క్యాంపులు సచివాలయాలలో ఏర్పాటు చేస్తున్నామని 9వ తేదీన ముక్తేశ్వరం, 10న వైదన, 11న ఎస్ఎల్ గుడిపాడు, 12న కొత్తూరు, 13న కూకట్లపల్లి, 16న వెలమవారిపాలెం, 17న కొప్పెరపాడు, 18న కొమ్మినేనివారిపాలెం, 19న వల్లాపల్లి, 20న అంబడిపూడి, 21 గుంటుపల్లి, 23న ఉప్పుమాగులూరు 24న వేమవరం, 26న కొప్పెరపాలెం, 27న నక్కబొక్కలపాడు, 30న మల్లాయపాలెం గ్రామాలలో ప్రత్యేక క్యాంపులు జరుగుతాయని ప్రజలు సచివాలయాలను సంప్రదించాలని ఎంపీడీవో కోరారు.

## గంగవరంలో నేత్రదానం



ఇంకొల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరంలో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెం దిన ప్రముఖ అపరాల వ్యాపారిగా ఇం కొల్లు ప్రాంతానికి సుపరిచితులైన జాగర్లమూడి ముత్యాలు(82) శనివారం మృతి చెందారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుం టూరు శంకర నేత్రాలయం వైద్యులు ముత్యాలు నుంచి నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు తదితరులు అభినం దించారు. టీడీపీ నాయకులు వీరగంధం ఆంజనేయులు, బోడెంపూడి సుబ్బారావు, వీరాంజనేయులు ముత్యాలుకు నివాళులర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మార్టూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు వైపు ముందువెళుతున్న మినీ లారీని వెనుక నుంచి లగేజి ఆటో ఢీకొన్న ఘటన ఆదివారం రాజుపాలెం సెంటరు వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో లగేజి ఆటోలో ఉన్న ధనలక్ష్మి కాలు విరిగింది. 108లో ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విజయవాడ ఒన్‌టౌన్‌కు చెందిన ఒక వ్యక్తి, ఆరుగురు మహిళలు వంట పని నిమిత్తం లగేజి ఆటోలో తిరుపతి వెళ్లి పని ముగించుకొని విజయవాడ వస్తున్నారు. అదే సమయంలో ముందు వెళుతున్న మినీ లారీని ఆటో ఢీకొనగా ప్రమాదం జరిగింది. వాహనంలోని మిగిలిన వారందరూ క్షేమంగా బయటపడ్డారు.


## ఇద్దరికి గాయాలు

పంగులూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు నుంచి ఒడిశా వైపు వెళ్తున్న లారీ స్కూటీని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వారిని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.


గాయపడిన యువకులు

## లారీ డ్రైవర్ నిర్లక్ష్యం

**గంగమ్మ ఆలయ ముఖద్వారం ధ్వంసం**


లారీ ఢీకొడంతో ధ్వంసమైన ఆర్చి, అమ్మవారి బొమ్మలు

బల్లికురవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీర్ల గంగమ్మ దేవాలయ ముఖద్వారం (ఆర్చి)ను గ్రానైట్ లారీ ఢీకొనడంతో ధ్వంసమైంది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఘటన జరిగింది. అందిన సమాచారం మేరకు.. ఆదివారం వీర్ల కొండ వద్ద గ్రానైట్ క్వారీ నుంచి రాళ్లను రవాణా చేసే లారీ గంగమ్మ ఆలయం వైపు వెళుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీ హైడ్రాలిక్ దించకుండా దేవాలయ ముఖ ద్వారంలోకి వెళ్లడంతో ముఖ ద్వారం పైభాగం పడిపోయింది. ఆర్చిపై ఉన్న అమ్మవారి బొమ్మలు పడిపోవడంతో భక్తులు ఆందోళన చెందారు. ఎంతో ప్రసిద్ధ ఆలయ ముఖ ద్వారంలోకి డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని తీసుకు వెళ్లడం వలనే ప్రమాదం జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

- పాయసంలో పురుగు మందు కలుపుకొని తాగిన వైనం
- భర్త నుంచి విడాకుల నోటీసులు రావడంతో మనస్తాపం

చీరాలటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భర్త నుంచి విడాకుల నోటీసులు అందుకున్న భార్య వేదనకు గురైంది. కూతురు బాధ చూసి తల్లి కూడా కలత చెందింది. ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో తల్లీకూతురు పురుగు మందును పాయసంలో కలుపుకుని తాగారు. దీంతో బంధువులు ఇద్దరినీ చీరాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చీరాల సంపత్‌నగర్‌కు చెందిన యువతికి, ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన వ్యక్తితో సుమారు ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. భార్యాభర్తలిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరికి ఏడాది పాప ఉంది. మూడు నెలల కిందట దాంపత్య జీవితంలో నెలకొన్న వివాదం కారణంగా భార్య పుట్టింటికి వచ్చింది. దీంతో భర్త శనివారం విడాకుల నోటీసులు పంపించారు. దీంతో నిండు జీవితం అయోమయ స్థితికి చేరడంతో పుట్టెడు దుంఖఃతో వేదన చెందింది. కుమార్తె బాధను చూసి తల్లి కూడా తల్లడిల్లింది. ఇరువురు కలిసి శనివారం రాత్రి సమయంలో ఇంట్లోనే పాయసంలో పురుగుల మందు కలుపుకుని తాగారు. ఆలస్యంగా గ్రహించిన బాధితురాలి తండ్రి కుమార్తె, భార్యను ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉండగా, అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.





సెల్ఫీ తీసుకుంటూ.. గుర్రపు స్వారీ చేస్తూ..



చిన్నా పెద్దా కేరింతలు




వేటకు సన్నద్ధమవుతున్న మత్స్యకారులు

# బీచ్‌లో సరదాగా..

సెలవు రోజుల్లో సరదాగా గడుపుదామని ఎవరికుండదు..? బీచ్‌లకు వెళ్లాలని, బంధువులు, స్నేహితులతో షికారు చేయాలని, సినిమా చూసి, అలా రెస్టారెంట్లలో కొత్తకొత్త వంటలు రుచిచూద్దామని.. ఇలా ఎన్నో ఆలోచనలు చేస్తుంటారు. జిల్లాలో తీర ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో జనమంతా అక్కడికి వెళుతుంటారు.బీచ్‌ల్లో సముద్రపు అలలు పాదాలను తాకుతూ ఆహ్లాదంగా ఉంచడమే కాకుండా,మనసును తేలికగా చేస్తాయి. శాంతంగా ఉండే సముద్ర గాలులకు చిన్నారులు, యువత కేరింతలు కొడుతుంది. సముద్రం మధ్యలో కాసేపు గడపడం.. ఇవన్నీ తీయని గుర్తులు కాక మరేమిటి. ఇలాంటి మరుపురాని అనుభవాలను సొంతం చేసుకునే క్రమంలో మైపాడులో తీరంలో ఆదివారం కనిపించిన దృశ్యాలు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు.



సముద్ర స్నానం చేస్తూ..



రేపు మళ్లీ వస్తానుగా.. అంటూ పడమర దిక్కున వాలుతున్న సూర్యుడు

# బరితెగింపు

- ఇరిగేషన్‌శాఖలో అధికారుల లెక్కలేనితనం
- క్యూసీ సర్టిఫికెట్ ట్యాంపరింగ్ చేసిన ఘనులు
- గత ప్రభుత్వంలో దోచుకుతిన్న అక్రమార్కులు
- ప్రభుత్వం మారినా తగ్గని అవినీతి
- ఓ వైపు విజిలెన్స్ విచారణ జరుగుతున్నా, జంకని వైనం
- అక్షరసత్యంగా 'ఆంధ్రజ్యోతి' కథనం

వారికి ఉద్యోగమంటే బాధ్యత లేదు... ప్రభుత్వమంటే లెక్కేలేదు.... చివరకు విజిలెన్స్ విచారణ అన్నా.. భయం కూడా లేదు.. ఇది ఇరిగేషన్ శాఖలోని కొంతమంది అధికారుల తీరు... ప్రభుత్వం మారింది కానీ తమ అవినీతి చేష్టలు మాత్రం మారలేదని వారు నిరూపిస్తున్నారు. గత ప్రభుత్వంలో మొదలైన దోపిడీ... కూటమి ప్రభుత్వంలో కూడా కొనసాగుతుండడం గమనార్హం. నాడు పనులు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు పెట్టుకొని తినేశారు. ఇప్పుడు పనులు చేయకుండానే చేసినట్లుగా దొంగ క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) సర్టిఫికెట్లతో ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. బుచ్చి సబ్ డివిజన్‌లో వైట్‌నర్‌తో ట్యాంపరింగ్ చేసిన క్యూసీ సర్టిఫికెట్ ఫేక్‌ది అని తేలిపోయింది. దీని ఒరిజినల్ సర్టిఫికెట్ మరో వర్కుకు ఇచ్చినదని క్వాలిటీ అధికారులు స్పష్టం చేశారు. ఇంతటి బరితెగింపునకు పాల్పడిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది.

నెల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫ్లడ్ డ్యామేజీ రిపేర్స్(ఎఫ్‌డీఆర్) కింద 2021లో సుమారు రూ.232 కోట్ల పనులకు అప్పటి కలెక్టర్ అనుమతులిచ్చారు. అయితే చాలా పనులు అప్పట్లోనే చేసినట్లుగా బిల్లులు పెట్టగా, ఆ బిల్లులన్నీ ఇటీవల మంజూరయ్యాయి. అయితే మూడేళ్ల తర్వాత తాజాగా బుచ్చి సబ్‌డివిజన్ నుంచి కొన్ని బిల్లులు అప్‌లోడ్ అవుతున్నాయి. ఇన్నేళ్ల తర్వాత అప్‌లోడ్ చేయడమే ఒక తప్పయితే, ఆ బిల్లులకు దొంగ క్యూసీ సర్టిఫికెట్‌లు పెట్టడం మరో పెద్ద బాగోతంగా కనిపిస్తోంది. కోవూరు సెక్షన్‌లోని రాజుపాలెం వద్ద బాబూరావు కాలువను బాగు చేసినట్లు రూ.9.99 లక్షల ఎస్టిమేట్ విలువతో ఇటీవల బిల్లు అప్‌లోడ్ చేశారు. అయితే ఈ బిల్లుకు జతచేసిన క్యూసీ సర్టిఫికెట్ ట్యాంపరింగ్ చేసి ఉంది. దీంతో పేఅండ్‌అకౌంట్స్ అధికారి ఈ బిల్లును వెనక్కి పంపారు. ఈ ట్యాంపరింగ్ సర్టిఫికెట్ 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కగా దీనిపై ఈనెల 5న 'ఎఫ్‌డీఆర్ పనుల్లో కొనసాగుతున్న దోపిడీ' అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. అయినా ఉన్నతాధికారులెవరూ స్పందించలేదు. అసలు ఎందుకు ఈ క్యూసీ సర్టిఫికెట్‌ను ట్యాంపరింగ్ చేయాల్సి వచ్చిందన్న విషయాన్ని క్వాలిటీ కంట్రోల్ అధికారుల వద్ద ఆరా తీయగా, అసలు బాగోతం వెలుగులోకి వచ్చింది. ఈ నంబర్ కలిగిన క్యూసీ సర్టిఫికెట్‌ను ఒరిజినల్‌గా జారీ చేసింది ఇనమడుగు చానల్ రిపేర్స్ కోసం కాగా, దీని ఎస్టిమేట్ విలువ రూ.6 లక్షలుగా ఉంది. అయితే ఈ వర్కు బిల్లు కూడా ప్రభుత్వం నుంచి మంజూరైనట్లు ఇరిగేషన్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇక ఆ క్యూసీ సర్టిఫికెట్‌తో పనిలేదు కాబట్టి ఆ సర్టిఫికెట్‌ను ట్యాంపరింగ్ చేసి రాజుపాలెం వద్ద బాబురావు కాలువలో పనులు చేసినట్లుగా చూపించి ప్రజాధనాన్ని దోచేందుకు స్కెచ్ వేసినట్లు అర్థమవుతోంది. ఇంత ధైర్యంగా సర్టిఫికెట్లను ట్యాంపరింగ్ చేసి ప్రజాధనాన్ని కొట్టేయాలని చూస్తున్నారంటే ఇరిగేషన్ శాఖలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.




GOVERNMENT OF ANDHRA PRADESH
WATER RESOURCES DEPARTMENT
TGP QC Sub-Division, Kaluvoya
Quality Control Certificate

ఇనమడుగు కాలువ పనులకు ఇచ్చిన ఒరిజినల్ క్యూసీ సర్టిఫికెట్

## విజిలెన్స్ విచారణ జరుగుతున్నా..

గత ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖలో భారీ అవినీతి జరిగినట్లు మొదటి నుంచి టీడీపీ నేతలు ఆరోపిస్తూ వస్తున్నారు. పనులు చేయకుండానే చేసినట్లుగా చూపించి బిల్లులు తినేశారన్న ఆరోపణలున్నాయి. రికార్డుల్లో కాలువలు బాగు చేసినట్లు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం కాలువల దుస్థితి అగమ్యగోచరంగానే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కాలువలను బాగు చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై పలువురు ఎమ్మెల్యేలు ముఖ్య మంత్రి చంద్ర బాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖలోని అధికారులు, ఉద్యోగులు ఎమ్మెల్యేల వద్దకు పరుగులు తీశారు. నాడు వైసీపీ నేతల ఒత్తిడితో తప్పులు చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చుకున్నారు. ఇదిలా ఉండగా విజిలెన్స్ విచారణ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే నాడు జరిగిన పనులకు సంబంధించిన రికార్డులన్నీ స్వాధీనం చేసుకుంటున్నారు. ఇలా విజిలెన్స్ విచారణ జరుగుతున్నా, అవినీతికి అలవాటు పడ్డ కొంతమంది అధికారుల తీరులో మాత్రం మార్పు లేదు. ఈ వ్యవహారాలు తెలిసినా ఉన్నతాధికారులు కూడా ఎందుకు మౌనంగా ఉంటున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



GOVERNMENT OF ANDHRA PRADESH
WATER RESOURCES DEPARTMENT
Quality Control Certificate

బాబూరావు కాలువ పనులకు ఇచ్చినట్లుగా చూపిస్తున్న ట్యాంపరింగ్ సర్టిఫికెట్

## వివరాలు అడుగుతాం

ఈ వ్యవహారంపై క్వాలిటీ కంట్రోల్ ఈఈ ధనుంజయనాయుడును వివరణ కోరగా ఒరిజినల్‌గా ఈ సర్టిఫికెట్‌ను వేరొక వర్కుకు ఇచ్చినట్లుగా తమ రికార్డుల్లో ఉందని చెప్పారు. దీనిపై సంబంధిత అధికారులను వివరాలు కోరుతామని, అనంతరం చట్ట ప్రకారం చర్యలు చేపడతామని వెల్లడించారు. కాగా ఇరిగేషన్ ఎస్‌ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా ట్యాంపరింగ్ సర్టిఫికెట్‌పై సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి వివరణ తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

- పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదం
- నలుగురు మృతి, మరో నలుగురికి గాయాలు
- మొక్కులు తీర్చుకుని వస్తుండగా దుర్ఘటన

వారంతా తమ ఇష్టదైవాన్ని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ఇక తమ కోరికలన్నీ నెరవేరినట్లేనని సంబరపడ్డారు. ఆనందంతో ఇంటిముఖం పట్టారు. బంధువులు, స్నేహితులతో ఫోన్లలో మాట్లాడుకుంటూ వస్తున్నారు. రాత్రి పొద్దుపోవడంతో కొందరు నిద్ర పోయారు.ఒకరిద్దరూ నిద్రమత్తులోనే ఏదో మాట్లాడుతున్నారు. ఇంతలో ఆదివారం వేకువకావడం, ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురికావడం జరిగింది. అప్పటి వరకు వారిలో ఉన్న ఆనందం క్షణాల్లో ఆవిరైంది. అంతులేని విషాదాన్ని మిగిల్చింది.

# ఆనందం.. క్షణాల్లో ఆవిరి

కావలి, సిరిపురంలో విషాదఛాయలు

కావలి రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ మండలం సిరిపురం నుంచి తెలంగాణ రాష్ట్రంలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు శుక్రవారం ఉదయం ఎమిమిది మంది కారులో బయలుదేరారు. తిరుగుప్రయాణంలో ఆదివారం తెల్లవారుజామున పల్నాడు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు.ఈ వార్త అటు సిరిపురంలోనూ, ఇటు కావలి వైకుంఠపురంలోనూ విషాదం నింపింది. మొక్కులు తీర్చుకుని ఇంటికి వస్తున్నారని ఎదురుచూస్తున్న వారి కుటుంబసభ్యులకు, పిడుగులాంటి ప్రమాదవార్త విని ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయారు. అందరితో కలిసిమెలసి ఉండేవారు ఇక లేరని తెలిసి గ్రామస్థులు కూడా విషాదంలో మునిగిపోయారు. కావలి మండలం సిరిపురం గ్రామానికి చెందిన తుళ్లూరు సురేష్(35), ఆయన భార్య వనిత(32) ఉప్పాల ఏబులు (60), కావలి వైకుంఠపురానికి చెందిన తాతా తిరుపతి(55) ఒకే కుటుంబానికి చెందినవారు కావడం, వారంతా ప్రమాదంలో మృతి చెండడంతో వారి బంధువులు విషాదంలో మునిగారు. తుళ్లూరు సురేష్- వనిత దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు. తల్లితండ్రులను కోల్పోవడంతో వారు అనాథులుగా మిగిలిపోయారు. తల్లి తండ్రులు లేరనే విషయం తెలియని ఆ పిల్లలు వాళ్లు ఎప్పుడు వస్తారోనని ఎదురు చూస్తున్నారు. బేల్దారి పనులు చేసుకుని జీవించే ఏబులు మృతితో ఆకుటుంబం కష్టాల్లో చిక్కుకుంటుంది. కావలిలో ఆటో నడుపుకుని కుటుంబాన్ని పోషిస్తున్న తిరుపతి మృతితో వారి కుటుంబ జీవనం భారంగా మారింది. మృతులంతా కూలినాలి చేసుకుని జీవించేవారు కావటంతో వారి బంధువులు, స్నేహితులను ఓదార్చడం ఎవరితరం కాలేదు.



మృతి చెందిన ఉప్పాల ఏబులు (ఫైల్)



తాతా తిరుపతి (ఫైల్)



తుళ్లూరు వనిత (ఫైల్)



తుళ్లూరు సురేష్ (ఫైల్)

# దెబ్బతిన్న రాళ్లపాడు కుడి కాలువ గేటు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు రిజర్వాయరు కుడి కాలువ ప్రధాన గేటు దెబ్బతింది. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో కాలువకు నీటి విడుదలను అధికారులు ఆపివేశారు. శనివారం తిరిగి నీరు విడుదలకు ప్రయత్నిస్తున్న సమయంలో ఒకటవ గేటు విరిగి లోపల పడిపో యింది. కుడికాలువ నీటి విడుదల, నిలుపుదలను నియంత్రించేందుకు రెండు గేట్లు ఉంటాయి. వీటిలో మొదటి గేటు ఎత్తే సమయంలో మూడు రౌండ్లు తిప్పాక విరిగి కిందకు పడిపోయింది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిన ప్రాజెక్టు అధికారులు, గేట్ల మరమ్మతుల్లో ఎంతో అనుభవం ఉన్న నరసరావుపేటకి చెందిన బాషాను రప్పించి మరమ్మతులకు ప్రయత్నిస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రాజెక్టు నిర్వహణ అధ్వానంగా ఉంది. దీంతో కాలువల గేట్లు కానీ, ప్రధాన గేట్ల నిర్వహణ కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ పరి స్థితే నేటి దుస్థితికి కారణమని రైతులు విమర్శిస్తున్నారు. ఈ గేటు హైడ్రా లిక్‌తో సంబంధం తెగిపోయి విరిగి లోపల పడిపోవటంతో దీన్ని బయటకు తీయటం కష్టసాధ్యమని, బయటకు తీసి వెల్డింగ్ చేసి హైడ్రాలిక్‌తో అనుసంధానించి యథావిధిగా లోపలికి దించాల్సి ఉంటుందని మెకానిక్ బాషా తెలిపారు. ఈ క్రమంలో రెండవ గేటుపై నీటివత్తిడి పడకుండా తగు జాగ్రత్తలు కూడా తీసుకోవాల్సి ఉన్నందున కనీసం మూడురోజులు పడుతుందని ఆయన తెలిపారు. కాగా రాళ్లపాడులో నీటిమట్టం 19.11 అడుగులకు చేరటంతో మరో అడుగు నీరు చేరితే గేట్లు ఎత్తి నీటిని మన్నేరుకు విడుదల చేయాల్సి ఉంది.



ఉదయగిరి రూరల్ : అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీన చేసుకున్న పోలీసులు(ఫైల్)

# ఊరికో బెల్టు !

- వేలం ద్వారా దుకాణాల కేటాయింపు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- బరితెగిస్తున్న మద్యం వ్యాపారులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలను మద్యం వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే సహించేదిలేదని స్వయానా సీఎం చంద్ర బాబు పదేపదే హెచ్చరిస్తున్నా వారు పట్టించుకోవడంలేదు. తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు గ్రామాల్లో బెల్టుషాపు లను ప్రోత్సహిస్తున్నారు. వేలం ద్వారా వాటిని కేటాయిస్తున్నారు. కొందరు వ్యక్త లు వేలం పాడి మరీ బెల్టు దుకాణాలను దక్కించుకుంటున్నారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## ఊరూరా బెల్టు

ఉదయగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు మండలాల్లో 12 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలోని అన్నీ గ్రామాల్లోనూ బెల్టు దుకాణాలు వెలిశాయి. డిమాండ్‌ను బట్టి క్వార్టర్‌పై రూ.40 నుంచి రూ.60ల చొప్పున అదనరంగా వసూలు చేస్తున్నారు. మరికొందరు ద్విచక్ర వాహనంలో మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు ఇప్పటికే సిండికేట్ కాగా, మరికొంతమంది సిండికేట్ అయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బెల్టు దుకాణాలకు వేలం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఉదయగిరి మండలం బండగానిపల్లి పంచాయతీలోని ఓ గ్రామంలో రూ.70 వేలకు ఓ మహిళ వేలం పాడి బెల్టు దుకాణం దక్కించుకున్నట్లు సమాచారం.

## దాడులు చేస్తున్నా.. లెక్కేలేదు !

ఎక్సైజ్ అధికారులతోపాటు పోలీసులు బెల్టు దుకాణాలపై దాడులు చేస్తున్నా, నిర్వాహకులు లెక్కచేయడంలేదు. కేసులు నమోదు చేసినా, యథేచ్ఛగా తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ముఖ్యంగా నందిపాడు, కృష్ణంపల్లి, అప్పసముద్రం, గండిపాళెం, నర్రవాడ, పోలంగారిపల్లి, జడదేవి, నందవరం, మర్రిపాడు, ఏరుకొల్లు తదితర గ్రామాల్లో జోరుగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక దుకాణాలు ఉన్న ప్రాంతాలైన ఉదయగిరి, సీతారామపురం, మర్రిపాడు, దుత్తలూరు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే అనధికారిక మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, గ్రామాల్లో బెల్టు దుకాణాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### కేసులు నమోదు చేస్తూనే ఉన్నాం

గ్రామాల్లో బెల్టు షాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తూనే ఉన్నాం. ఇప్పటివరకు సర్కిల్ పరిధిలో 17 కేసులు నమోదు చేశాం. అనధికార మద్యం విక్రయాలపై తనిఖీలు చేస్తున్నాం.

-ఉదయగిరి ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి

## కందుకూరులో విచ్చలవిడిగా దుకాణాలు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బెల్టుదుకాణాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఒక్కో గ్రామంలో నాలుగైదు బెల్టుషాపులు ఉన్నాయి. మద్యం వ్యాపారులే బెల్టుషాపులకు మద్యం చేరవేసి క్వార్టర్ బాటిల్‌కు రూ. 20 అదనంగా వసూలు చేస్తున్నారు. బెల్టు దుకాణాల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం (ఎస్టీఎఫ్) నియోజక వర్గంలో నిర్వహిం చిన తనిఖీల్లో పెద్దఎత్తున బెల్టు దుకాణాలు ఉన్నట్లు గుర్తించడమే కాక, మాచవరం, గుడ్లూరు, పోట్లూరు గ్రామాల్లోని బెల్టుషాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. గుడ్లూరులో ప్రధాన మద్యం దుకాణం సమీపంలోనే బెల్టుషాపు నిర్వహిస్తున్నారు. వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లో బెల్టుషాపుల్లోనే ప్రధానంగా విక్రయాలు చేయిస్తున్నారు. ప్రధాన సెంటర్లలో బహిరంగంగా ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు. పలుకూరు, కరేడు, సీతారామపురం, ఓగూరు తదితర గ్రామాల్లో బెల్టు దుకాణాల్లోనే రోజూ రూ. 40 వేల నుంచి రూ.50 వేల వ్యాపారం సాగుతున్నట్లు చెబుతున్నారు. మద్యం దుకాణదారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. పొరుగునే ఉన్న కొండపి నియోజకవర్గంలో ఒక్క బెల్ట్‌షాపు కూడా లేకపోవడం గమనార్హం.

## దుకాణానికి రూ. 1.25 లక్షల వసూలు

ఉన్నతాధికారుల ఆదేశాలతో ఒక్కో దుకాణదారు వద్ద ఎక్సైజ్ అధికారులు ఇటీవల రూ. 1.25 లక్షల వంతున మామూళ్ల వసూళ్ల చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మొత్తంలో ఎక్సైజ్ కమిషనర్ ఆఫీసుకు రూ. 10 వేలు, డిప్యూటీ కమిషనర్‌కు రూ. 30వేలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు రూ. 30 వేలు, ఏఈఎస్‌కు రూ.15వేలు, స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు రూ. 40వేల ప్రాతిపదికన ఈ వసూళ్ల చేశారు.

# కావలి

## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

# ఒళ్లు హూనమే!

- అధ్వానంగా వలేటివారిపాలెం - రామచంద్రాపురం రోడ్డు
- 10గ్రామాల ప్రజలను వెంటాడుతున్న ప్రయాణ కష్టాలు

వలేటివారిపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి రామచంద్రాపురానికి వెళ్లే రోడ్డుకు మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని 10గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ రోడ్డులో పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తే ఒళ్లు హూనం అవడంతో పాటు వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతాయని ప్రయాణికులు వాపోతున్నారు.

### ఈ రోడ్డులో వెళ్లే గ్రామాలివే..

వలేటివారిపాలెం నుండి లింగపాలెం, అంక భూపాలపురం, రామచంద్రాపురం, మూళ్లవారిపాలెం, చెంచుపాలెం, మాలపాడు, తిమ్మపాలెం, బోగనంపాడు, అగ్రహారం, అలవలపాడు, కనిగిరికి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి.

### పల్లెలు ఎక్కువ ఉండడంతో..

నిత్యం వందల మంది ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం, దుకాణాలకు, ఎక్కువగా పల్లెల నుండి వస్తుం టారు. మాలకొండ పుణ్యక్షేత్రానికి ప్రతి శనివారం వాహనాలలో వందల సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డుపై మోకాటి లోతు గుంతలు ఏర్పడడంతో ప్రయాణం సాగించాలంటే అవస్థలు పడుతున్నారు. రాత్రివేళ్లలో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురిఅవుతున్నారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలతో మరింత అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాట య్యాక వలేటివారిపాలెం నుండి రామచంద్రాపురం వరకూ ప్యాచ్ పనులు చేపట్టి లేయర్ తారు వేసేందుకు రూ.20లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారి వివరణ..

పది గ్రామాల పడుతున్న ప్రయాణ ఇబ్బందులపై సంబంధిత పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా నిధులు మంజూరు అయినట్లు చెప్పారు. ఉన్నతాధికారులు అనుమతి ఇస్తే పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.



గుంతలమయంగా రామచంద్రాపురంనకు వెళ్లే రోడ్డు

# తరాలకు తెలిసేలా అమరజీవి త్యాగం

- కందుకూరులో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

కందుకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దబజారు బండ్లమిట్ట కూడలిలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు నూతన విగ్రహాన్ని ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్‌తో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, యువకులు సొంత నిధులతో విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అమరజీవి త్యాగం తరతరాలకు తెలిసేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

### సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి

పథంలో పయనిస్తుందని చెప్పారు. అందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. పట్టణ ఆర్యవైశ్యులకు తమ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. అంతకుముందు ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు వారికి ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు, ఆర్యవైశ్య ప్రముఖులు దర్శి హరికృష్ణ, పల్లపోతు వెంకటేశ్వర్లు, కోట హనుమంతరావు, స్థానిక పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నెరోశయ్య, మాదాల లక్ష్మీ నరసింహ్మం పాల్గొన్నారు.

### టీడీపీ కార్యాలయంలో ఎంపీ వేమిరెడ్డి

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తొలిసారిగా టీడీపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా నేతలు నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై వినతులు అందజేశారు. బీజేపీ నేతలు గట్టమనేని హరిబాబు, ముప్పల భూషయ్య, వరప్రసాదు ఎంపీని కలిశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కందుకూరు బైపాస్‌లో గుడ్లూరు రోడ్డు క్రాస్ వద్ద అండర్‌పాస్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు.

## న్యూస్ బాక్స్

### రేపు పెన్షనర్లకు క్రీడా పోటీలు

కావలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర పెన్షనర్ల సంఘం కావలి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఉదయగిరి రోడ్డు మినీ స్టేడియంలో మంగళవారం ఉదయం పెన్షనర్లకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సాయంత్రం పెన్షనర్స్ భవనంలో ఇండోర్‌గేమ్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ జరుగనున్న ఆలిండియా పెన్షనర్స్ డేను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### సైడు కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

లింగసముద్రం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువల నిర్మాణం చేపట్టాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవకి శేషగిరిరావు, టీడీపీ నాయకులు దేవకి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు ఆర్యవైశ్యులు ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వీరు కందుకూరులోని ఎమ్మెల్యే చాంబర్‌లో కలిసి మాట్లాడారు. లింగసముద్రం బస్టాండ్ సెంటర్‌లో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువలు లేక వర్షం కురిసిన ప్రతిసారీ నీరు ఇళ్లలోకి వస్తున్నట్లు తెలిపారు.

### సేవలను ప్రోత్సహించాలి



సన్మాన గ్రహీతలతో బిట్రగుంట వాకర్స్

బిట్రగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజసేవ చేసే వారిని ప్రోత్స హించడం మంచి ఆచారం అని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.స్వర్ణన్‌రాజ్, గౌరవాధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక పుట్‌బాల్ క్రీడా మైదానంలో బిట్రగుంట రైల్వే మాజీ చీఫ్ పరసనల్ ఆఫీసర్ గోవిందరాజులు, స్టేషన్ మాస్టర్ మద్దిబోయిన రాఘవప్రసాద్, వాకర్స్ మాజీ ఉపాధ్యక్షుడు మన్నెం శ్రీనివాసులును వాకర్స్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖర్, వాకర్స్ ఫౌండర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు జిల్లానిబాషా, జీవన్‌కుమార్, సత్యనారాయణ చార్యులు ఉన్నారు.

### రాయితీపై విత్తనాలివ్వాలి

బిట్రగుంట, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి నారుమడుల రైతులకు నూరుశాతం రాయితీతో విత్తనాలు అందచేయాలని వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు ఆదివారం డిమాండ్ చేశారు. భారీ వర్షాలు, తుఫాన్ దెబ్బకు చిన్న సన్నకారు రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారని చెప్పారు.

### బీసీ వసతిగృహం తనిఖీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి

అనంతసాగరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన అనంతసాగరంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని జిల్లా స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ హాజరును పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, లేదా అనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఉదయగిరికి రాత్రి బస్సు సౌకర్యం కల్పించాలి



సన్నపురెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డేగ మధుయాదవ్

వింజమూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కావలి నుంచి ఉదయగిరికి రాత్రి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి 8మండలాల అధ్యక్షులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయగిరి పట్టణంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయనకు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వింజమూరు మండల అధ్యక్షుడు డేగ మధుయాదవ్ పాల్గొన్నారు.

### చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని బీఎంసీ చర్చిలో ఆదివారం క్రిస్మస్ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సుధీర్‌కుమార్ బైబిల్‌లోని సందేశాలు అందించారు.

## కావలిలో జబర్దస్త్ టీం సందడి



ఎమ్మెల్యే కుటుంబంతో జబర్దస్త్ టీమ్ సభ్యులు

కావలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామిరెడ్డితోట కల్యాణ మండపంలో రెడ్డిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయసమ్మేళనంలో జబర్దస్త్ టీం సభ్యులు హైపర్ ఆది, రైజింగ్ రాజు, బుల్లెట్ బాస్కర్, శాంతి, నరేష్, దొరబాబు సందడి చేశారు. అంతకుముందు వారు ముసునూరులోని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి నివాసానికి వచ్చి అల్పాహారం తీసుకున్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉన్న ప్రజలు వారితో కలిసి ఫొటోలు దిగటంతో అక్కడ సందడి నెలకొంది.

## రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ కరీమున్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ అధికారుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ఆత్మకూరు ప్రాంత ప్రయాణికులు, ప్రజలు తమ సూచనలు, సలహాలు ఫిర్యాదుల సెల్ నెంబరు 9959225645కు తెలియజేయాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక 33కేవీ సబ్‌స్టేషన్ నుంచి గుడ్లూరు ఫీడర్‌కు వెళ్లే ప్రధాన లైనుకు తగులుతున్న చెట్లు కొమ్మలు తొలగించేందుకు ఆ ఫీడర్ పరిధిలోని సబ్ స్టేషన్‌లకు సోమవారం ఉదయం 8.30గంటల నుంచి నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ ట్రాన్స్‌కో ఏఈ టీవీ నరసింహ్మం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా మండలంలోని పాలూరు సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. దీంతో ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఇస్తామని వినియోగదారులు, రైతులు ఈ అసౌకర్యాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

## నిధుల వృథా..



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పక్కాగృహాలు నిర్మించేందుకు సరఫరా చేసిన విలువైన ఇనుప చువ్వలు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేపట్టకపోవడంతోనే ఈపరిస్థితి దాపురించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హౌసింగ్ కార్యాలయ ప్రాంగణంలో ఎంతో విలువైన చువ్వలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు వృథా కాకుండా ప్రత్యామ్నాయ పనులకైనా వాటిని వినియోగించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- వరికుంటపాడు, (ఆంధ్రజ్యోతి)

## ఒక్క ఇల్లు కడితే ఒట్టు..



మండలంలోని 21గ్రామ పంచాయతీల్లో 28 జగనన్న లేఅవుట్ వేశారు. వీటిలో అంకభూపాలపురం, కాకర్లవారిపాలెం గ్రామాల్లో మినహా మిగిలిన గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఒక్క ఇల్లు కూడ కట్టలేదు. అంకభూపాలపురం, కాకర్లవారిపాలెంలో 15 ఇళ్లు కట్టారు. జగనన్న లేఅవుట్లలో వైసీపీ ప్రభుత్వం లక్షలు వెచ్చించి గ్రావెల్‌రోడ్లు, విద్యుత్ స్తంభాలు, నీటి సౌకర్యంతో ఇతర మౌలిక వసతులు కల్పించారు. ఇవి ఊరికి దూరంగా ఉండటం, శ్మశానాలు, వాగులు, వంకలు ఉండటంతో చాలామంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఫలితంగా లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.వలేటివారిపాలెం,

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

## ఘనంగా అయ్యప్ప పడిపూజ

వింజమూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసన్నరెడ్డినగర్‌లో ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం ఘనంగా ప డి పూజ నిర్వహించారు. స్వామివారికి అభిషే కాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వసంత్, ప్రసాద్, మస్తాన్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

### మాతమ్మకు ప్రత్యేక పూజలు

అనంతసాగరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికంభంపాడు గ్రామదేవత మాతమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా పెద్దఎత్తున మహిళలు ఆలయానికి చేరుకొని అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు.

### నాగారపమ్మకు..

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మతల్లికి ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ధ్యానంతో సమస్యల పరిష్కారం

వింజమూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో అన్నిరకాల సమస్యలు పరిష్కారమవుతాయని మాస్టర్ వసంత్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీవేదవ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో జరిగిన ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలోని కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు జరిగే పత్రీజీ ధ్యాన మహాయాగం కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని కోరారు. శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ధ్యానులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని తిరుమనకొండ రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠం పీఠాధిపతి, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు రాజరాజేశ్వరానందస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో ఆర్ఎస్ఎస్ సంఘ్ చాలక్‌లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ్ చాలక్ బాల సుబ్బారావు, బుచ్చి ఖండ్ చాలక్ కేశవయ్య, ఖండ్ కార్యవాహ్ వెంకట్రావ్ పాల్గొన్నారు.

## గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో పలు గ్రామాలకు బస్సులు నడపడంలేదని, ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఇన్నోవేటివ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లెక్కమనేని రాజేష్‌నాయుడు ఆదివారం వినతిపత్రం అందజేశారు.

## పంటలకు బీమాతో ధీమా

- వెంకటసుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, దుత్తలూరు



దుత్తలూరు (ఉదయగిరి రూరల్), డిసెం బరు 8 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసే రైతులు పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, ప్రీమియం చెల్లించిన రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు.

**? ఏయే పంటలకు బీమా చేసుకోవచ్చు.**

! మండలంలో శనగ, మినుము, వరి పంటలు సాగు చేసిన రైతులు బీమాకు అర్హులు.

**? ప్రీమియం ఎంత చెల్లించాలి.**

! శనగ రూ.480, మినుము రూ.285, వరి రూ.630 చొప్పున ఎకరాకు చెల్లించాలి.

**? ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం జరిగిందా.**

! ఫెంగల్ తుపాన్ ప్రభావంతో 750 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. నష్టపరిహారం కోసం జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం.

**? క్షేత్రస్థాయి పరిశీలనలు చే స్తున్నారా.**

! ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడంతో పాటు రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి తెగుళ్ల, నివారణ చర్యలు, పంటల సా గులో మెళకువలు వివరిస్తున్నాం.

## భగవద్గీతను పఠించాలి

లింగసముద్రం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు దైవభక్తితో భగవద్గీత గ్రంధ పఠనం చేయాలని త్రైత సిద్ధాంత- ప్రబోధ సేవాసమితి దుత్తలూరు అధ్యక్షులు ప్రసాద్ తెలిపారు. ఆదివారం తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం, విశ్వనాధపురం, మాలకొండరా యునిపాలెంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంధంపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండారెడ్డి, పెద్ద కొండారెడ్డి, మాల కొండారెడ్డి, సుధాకర్, వెంకటేశ్వర్లు, పెంచల రత్నం, నరసింహులు, ధనలక్ష్మి, నాగమ్మ, మధు, ఎస్.ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

## లైసెన్సు లేకుండా వాహనం నడిపితే కేసు

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు పేర్కొన్నారు. ఆదివారం ఆయన సంగం బ్యారేజి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కూలీల పేరుతో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని ఆటోడ్రైవర్లను హెచ్చరించారు.

## పేద కుటుంబానికి చేయూత

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో లక్ష్మమ్మ, దయాకర్ అనే ఓ దళిత పేద కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, చిరంజీవి యువత అధ్యక్షుడు భాను కిరణ్ ఆధ్వర్యంలో నెల రోజులకు సరిపడా బియ్యం, పప్పులు, నూనె వంటి సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## దోబీఘాట్లు లేక రజకుల అవస్థలు

సీతారామపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు కులవృత్తిదారుల కోసం ఏటా కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో కులవృత్తిదారుల జీవనం దుర్భరంగా మారింది. ప్రత్యేకించి రజక వృత్తిదారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సీతారామపురం మండలంలో వందల కుటుంబాలు రజక వృతిలో కొనసాగుతున్నాయి. అయితే మండలంలోని సింగరెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, పొలంగారిపల్లి, గుండుపల్లి, మారంరెడ్డిపల్లి, నెమళదిన్నె, గంగవరం, బసినేనిపల్లి, రొంపిదొడ్ల తదితర గ్రామాల్లో దోబీ ఘాట్లు లేకపోవడంతో ఆయా గ్రామాల్లోని రజకులు దుస్తులు ఉతికేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లోని వాగులు, చెరువుల్లో ప్రమాదమని తెలిసినా దుస్తులను ఉతకాల్సిన పరిస్థితి నెలకొంది. సీతారామపురం గ్రామంలో గతంలో నిర్మించిన దోబీ ఘాట్ శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ బోర్ మోటార్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడంతో దోబీ ఘాట్‌ను అలాగే వదిలేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలోని చెరువులు, కుంటలు, వాగులలో ప్రస్తుతం రజకులు దుస్తులు ఉతుకుతున్నప్పటికీ వేసవిలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, బోర్ మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని రజకులు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం కింద ఇస్త్రీపెట్టె, టేబుళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకపోయిందని, బీసీ కార్పొరేషన్ కింద రజకులు సొసైటీలుగా ఏర్పడి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా అప్పట్లో రుణాలు రాజకీయ జోక్యంతో అందలేదని రజకులు వాపోతున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను తీర్చాలని రజకులు కోరుతున్నారు.



సీతారామపురంలో శిథిలమైన దోబీఘాట్లు

## పేకాట స్థావరంపై దాడులు

చేజర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిలేరు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం సంగం సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి లక్షా మూడు వేల రూపాయల నగదు, 8 మోటారుబైక్‌లు, 10సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్నవారిని పోలీస్‌స్టేషన్‌కు తరలిం చారు. ఈ దాడుల్లో ఏఎస్ పేట ఎస్ఐ సైదులుతో పాటు చేజర్ల, ఏఎస్ పేట, సంగం పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.